
వార్త
ఆదివారం
12 మార్చి, 2023
ప్రేమే నేరమౌనా!

## తారాతీరం

# శ్రీలీలకు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు

**రోషన్** కథానాయకుడుగా గౌరి రోనంకి దర్శకత్వంలో తెరకెక్కిన 'పెళ్లిసందడి' చిత్రం ద్వారా టాలీవుడ్‌కి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన శ్రీలీల ఆ సినిమాతో సక్సెస్ అందుకోవడంతో పాటు తన అందం, అభినయంతో ఆకట్టుకున్నారు. ఇటీవల మాస్ మహారాజ రవితేజ హీరోగా త్రినాథరావు నక్కిన తీసిన 'ధమాకా' మూవీలో మరో భారీ సక్సెస్ సొంతం చేసుకుని వరుస ఆఫర్లు దక్కించుకున్నట్లు సమాచారం.

ప్రస్తుతం సూపర్ స్టార్ మహేశ్‌బాబుతో త్రివిక్రమ్ శ్రీనివాస్ తీస్తున్న మహేశ్ 28 సినిమాతో పాటు, నితిన్‌తో వక్కంతం వంశీ తీస్తున్న సినిమా, బాలయ్య 108 చిత్రం, రామ్‌తో బోయపాటి తీస్తున్న మూవీ, నవీన్ పొలిశెట్టితో 'అనగనగా ఒక రోజు', పంజా వైష్ణవ్ తేజ్ నెక్స్ట్ సినిమా, కిరీటి హీరోగా రూపొందుతోన్న జూనియర్ మూవీ.. వీటితో పాటు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో హరీష్ శంకర్ తెరకెక్కించనున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాలతో టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో శ్రీలీల దూసుకెళ్తున్నారు.



# ప్రభాస్‌కి తాత పాత్రలో సంజయ్‌దత్



**పాన్ ఇండియా** స్టార్ ప్రభాస్‌తో ప్రస్తుతం యువ దర్శకుడు మారుతీ ఒక భారీ కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ తెరకెక్కిస్తున్నారు. తొలిసారిగా ప్రభాస్‌తో చేస్తున్న ఈ సినిమా స్క్రిప్ట్, స్టోరీని అద్భుతంగా రాసుకున్న మారుతీ, దానిని అన్ని వర్గాల ఆడియన్స్‌ని, ప్రభాస్ ఫ్యాన్స్‌ని ఆకట్టుకునేలా మరింత అద్భుతంగా చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంస్థపై టిజి విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల ఎంతో భారీ వ్యయంతో రూపొందిస్తున్న ఈ సినిమాపై అందరిలో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, ప్రభాస్‌కి తాత పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే ఇరవై శాతం టాకీ పార్ట్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం తరువాతి షెడ్యూల్ మార్చి రెండవ వారంలో జరుగనున్నట్లు సమాచారం. ముగ్గురు స్టార్ హీరోయిన్స్ ఇందులో ప్రభాస్‌కి జోడీగా నడిస్తుండగా, వీలైనంత త్వరలో షూటింగ్ పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు యూనిట్ సన్నాహాలు చేస్తోందట.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
12 మార్చి, 2023

## మంచి ముత్యాలు

మనల్ని గురించిన మన అభిప్రాయాల కన్నా,
మన శత్రువుల భావాలే యదార్థానికి దగ్గరగా వుంటాయి.

- రోష్ ఫోకాల్డ్

## విషయ విశేషం

సజీవ శిలలు... 4
'సంఘీ'భావం.....5
రైతుకు ఏదీ ఆర్థిక భరోసా
కవర్ స్టోరీ..6
ప్రేమే నేరమౌనా!
త్రిమూర్తి స్వరూపిణి 'శ్రీపటాన్‌దేవి'.11
ఈవారం కవిత్వం..14
గులాబి
మంచు తుపానులో......18
కథ.. 20
మానెమ్మ
సాహిత్యం...23
విశిష్ట ప్రక్రియల 'పూర్ణచంద్'
ఆకారంలో చిన్న..ఆదాయంలో మిన్న సింగపూర్ ...25
ఈ ఉగాదికే పెళ్లి....30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..




# తాజా వార్తలు

## వృద్ధాప్యాన్ని వాయిదా వేయొచ్చు..

వృద్ధాప్యం రాకుండా ఉండేందుకు కొంతమంది సంపన్నులు యువ రక్తాన్ని ఎక్కించుకోవడం లాంటి సంఘటనలు సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో చూస్తుంటాం. అయితే ఇలాంటివి ముమ్ముందు సినీ కథలకే పరిమితం కాకుండా నిజం కానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆర్థ్రయిటిస్‌కి వాడుతున్న ఓ ఔషధానికి మూల రక్త కణాలను పునరుద్ధరించే శక్తి ఉన్నట్లు గుర్తించారు. ఎలా అంటే.. చిన్న వయసు ఎలుకల రక్తాన్ని వృద్ధ ఎలుకలకు ఎక్కించినప్పుడు ఎలాంటి ఫలితం కనిపించిందో అదే విధంగా ఈ మందు ఎక్కించినప్పుడు కొత్త రక్తకణాలు ఉత్పత్తి అయ్యాయట. ఎలుకల్లో చేసిన గత ప్రయోగాల్లో యువ రక్తం వల్ల వాటి మెదడు పనితీరుతో పాటు ఆయుఃప్రమాణం కూడా పెరిగినట్లు తేలింది. కానీ ఆయా పరిశోధనలన్నీ కేవలం రోగాలను తగ్గించేందుకు మాత్రమే చేసారు. కానీ కొలంబియా, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు రక్తకణాల్ని ఏ రకంగా పునరుద్ధరించగలం.. అన్నదాని మీద దృష్టి పెట్టారు. ఎందుకంటే యువరక్తం ఎక్కించడం వల్ల వృద్ధుల ఆయుష్షును కొంతవరకే పోడిగించగలం. అందుకే రక్తకణాల్ని ఉత్పత్తి చేసే మూలకణాల్లోని మార్పుల్ని నిశితంగా గమనించారు. అందులో భాగంగా ఆర్థ్రయిటిస్‌కు మందులు వాడినప్పుడు ఆయా మూలకణాలు మళ్లీ పూర్వపు స్థితికి చేరుకుని రక్తకణాల్ని ఉత్పత్తి చేస్తున్నట్లు గుర్తించారు. కనుక ఈ మందు ద్వారా వృద్ధాప్యాన్ని వాయిదా వేయొచ్చంటున్నారు సదరు పరిశోధకులు.

### వ్యాధిని గుర్తించే చర్మం!

చర్మం వ్యాధినెలా గుర్తిస్తుంది? అనిపిస్తుంది.. నిజమే! కానీ ఇది కూడా సుతిమెత్తని చర్మాన్ని తలపించే వేరబుల్ పరికరం మాత్రమే. ఇప్పటికే ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు ఆప్‌ల సాయంతో పనిచేసే స్మార్ట్ వాచ్‌లు, ఫిట్‌బిట్‌లు లాంటివెన్నో వచ్చాయి. ఇరవై నాలుగ్గంటలూ వాటిని ఒంటిమీద ఉంచుకోవాలంటే ఒక్కోసారి ఇబ్బందిగా అనిపిస్తుంది. అందుకే కొలంబియాలోని మిస్సోరి యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చర్మం లాంటి ఓ పదార్థాన్ని రూపొందించారు. ఇది సాగే గుణంతో సన్నని రంధ్రాలతో ఉంటుంది. కనుక దీన్ని చేతికి తొడుక్కుంటే చాలు.. ఇక దాని గురించి ఏమాత్రం పట్టించుకోవాల్సిన అవసరం ఉండదట. ఇతర పరికరాల మాదిరి ఇది కూడా బీపీ, గుండె పనితీరు, చర్మంలోని తేమశాతం.. ఇలా అన్నింటినీ నిశితంగా పసిగట్టి ఎలాంటి వైర్ల సహాయం లేకుండానే స్మార్ట్ ఫోన్‌కి పంపుతుంది. కనుక ఆ డేటాను వైద్య నిపుణులకి పంపిస్తే, రాబోయే అనారోగ్యాన్ని ముందే పసిగట్టవచ్చంటున్నారు.











# సజీవ శిలలు





శిల్పాలలో జీవం ఉట్టిపడితే వాటిని సజీవ శిల్పాలు అంటారు. సజీవ శిలలేంటి? అన్న సందేహం వస్తుంది ఎవరికైనా. అంతేకాదు, కాలం గడిచేకొద్దీ ఈ శిలలు పెరుగుతాయి. రాళ్ల ఎక్కడైనా అరుగుతాయి కానీ పెరుగుతాయంటున్నారేంటి? ఇదెక్కడి విడ్డూరం అనుకుంటున్నారా? ఇది నిజమే. రుమేనియా రాజధాని బుచారెస్ట్‌కు యాభై మైళ్ల దూరంలోని కోస్టెస్టీ గ్రామంలో, గ్రామ పరిసరాల్లోని ఇసుక నేలల్లోనూ కనిపించే ఈ సజీవ శిలలను 'ట్రోవంట్స్' అంటారు. ప్రతి వెయ్యేట్లకు వీటి పరిమాణం రెండు అంగుళాల మేరకు పెరుగుతుంది. పెరిగేకొద్దీ ఇవి జంతువులు, వృక్షాల ఆకారాలను సంతరించుకుంటాయి. వీటి పెరుగుదల క్రమాన్ని గమనిస్తే వృక్షగణం పెరుగుదల మాదిరిగానే ఉంటుంది. అంతేకాదు, ఈ శిలలు మరికొన్ని శిలలకు జన్మనిస్తాయి కూడా. వీటిలో కొన్ని చేతిలో ఇమిడిపోయే పరిమాణంలో ఉంటే, మరికొన్ని అడుగుల వ్యాసంతో భారీ పరిమాణంలో ఉంటాయి. ఈ శిలలపై చాలా ఏళ్లుగా భూగర్భ శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగిస్తున్నారు.





'సంఘీ' భావం



# అన్నదాతకు ఏదీ ఆర్థిక భరోసా

ఆరుగాలం నాగలి పట్టి సేద్యం చేసి పండించిన పంటకు ఆశించిన ధర రాకపోగా కనీసం ఖర్చుల మందం కూడా ఆదాయం రాకపోవడంతో అన్నదాత పరిస్థితి నానాటికీ దిగజారిపోతోంది. వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా ఉన్న మన దేశంలో అన్నదాత పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తుండటంతో రైతుల ఆర్థిక పరిస్థితి ఏమాత్రం ఎదుగూబొదుగూ లేకుండా ఉంది. కరోనా వంటి విపత్కర పరిస్థితిలో కూడా అన్నదాత తన పనులను మరిచిపోలేదు. ఈ ఒక్క రంగమే ఆనాడు ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనసాగింది. రైతుల జీవితాలను పరిశీలిస్తే నష్టాలు, కష్టాలు, అప్పులు, వడ్డీలు వంటివే అధికంగా కనిపిస్తాయి. మనదేశంలో అత్యధిక మంది సన్నకారు, చిన్నకారు రైతులు, కౌలు రైతులు మాత్రమే ఉన్నారు. బడా రైతులు ఎక్కడో నగరాల్లో స్థిరపడి వారి భూములు కౌలుకు ఇచ్చివేశారు. దీనితో 95 శాతం మంది రైతులు బయట అప్పులు చేసి పంట పెట్టుబడిని పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ప్రతి సీజన్‌లో అటు ప్రకృతి వైపరీత్యాలు కాని, ఇటు ప్రభుత్వం నుంచి సహకారం లభించకపోవడం కాని జరుగుతోంది. వరి రైతు నుంచి పత్తి, మిరప, గోధుమలు, చెరకు, కందులు పండించే వారే కాకుండా చివరకు కూరగాయలు పండించే రైతులు కూడా తీవ్ర వత్తిడిలో ఉంటున్నారు. ఇప్పటికే చాలా మంది తమ పిల్లలు వ్యవసాయరంగం వైపు రాకుండా ఇతర ఉపాధి మార్గాలు అన్వేషించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటిస్తే యువ రైతులు దర్శనం ఇవ్వడం లేదు. రైతు కుటుంబాలు క్రమంగా నగరం వైపు వలస పోవాలన్న తపన నానాటికీ అధికం అవుతోంది. ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధర వారికి ఏమాత్రం సహకారం అందించడం లేదు. గిట్టుబాటు ధర అందుకోవడంలో ఎన్నో అవరోధాలు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ యార్డుల్లో దళారులు, ఫైనాన్స్ వ్యాపారుల హవా ఎక్కువగా ఉంటోంది. వీరికి అక్కడి అధికారులు దాసోహం అంటూ వ్యవహరిస్తుండటంతో అన్నదాతలు అన్యాయానికి గురౌతున్నారు. ప్రస్తుతం ఉల్లి రైతుల గోస పరిశీలిస్తే అత్యంత దయనీయంగా ఉంది. మహారాష్ట్ర నాసిక్‌లో కిలో రెండు రూపాయలు పలుకుతుంటే, కర్నూలులో నాలుగు రూపాయలు మాత్రమే వస్తోంది. పండిన పంటను మార్కెట్‌కు తరలిస్తే కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్టు వైరల్ అయ్యింది. మహారాష్ట్రంలో 500 కిలోల ఉల్లిని మార్కెట్‌కు తరలిస్తే రవాణా ఖర్చులు పోను అతనికి వ్యాపారి రెండు రూపాయలు చెక్కు రూపంలో చెల్లించాడు. ఈ ఘటన రైతు పరిస్థితిని అద్దం పడుతుండటంలో సందేహం లేదు. ఇదే పరిస్థితి టమాటో రైతు కూడా తరచూ ఎదుర్కొంటున్నాడు. మిర్చి రైతులకు కూడా వారి భవిష్యత్తు అదృష్టంపై ఆధార పడి ఉంటుంది. దీనికి ప్రధాన కారణం మార్కెటింగ్ వ్యవస్థపై రైతుకు ప్రభుత్వం అవగాహన కల్పించలేకపోవడం. మార్కెట్‌లో టమాటో కిలో 30 రూపాయలకు చేరుకోగానే రైతులంతా ఒక్కసారిగా అదే పంటను వేస్తారు. దీనితో డిమాండ్‌కు మించి సరఫరా జరగడంతో ధర రూపాయి, రెండు రూపాయలకు పడిపోతుంది. కనీసం పంట కోయడానికి కూడా ఈ డబ్బు సరిపోకపోవడంతో పశువులకు వదిలేయడం లేదా రోడ్డుపై పారవేయడం జరుగుతోంది. ఇలాంటి పంటకు కనీసం స్టోరేజీ సౌకర్యాన్ని కల్పిస్తే కొంతవరకు ధరను నిలకడగా ఉంచే పరిస్థితి ఉంటుంది. అదేవిధంగా రైతులు మొదటిగా ఎదుర్కొనే సమస్య నాసిరకం విత్తనాలు. ఇలాంటి విత్తనాలు విక్రయించే సంస్థలపై కనీస స్థాయిలో చర్యలు తీసుకునే విధంగా కూడా చట్టాలు లేవు. వీరిపై కేవలం ఐపిసి 420 వంటి కేసులు పెడుతున్నారు. ఈ కారణంగా వారు స్టేషన్‌లో బెయిల్‌పై బయటకు వచ్చి తిరిగి నాసిరకం విత్తనాలు వ్యాపారం కొనసాగిస్తున్నారు. అదేవిధంగా కల్తీ క్రిమి సంహారక మందులు వ్యవహారం నిరంతరం కొనసాగుతూనే ఉంది. రైతు ఖర్చు చేయడమే కాని దానికి అనుగుణంగా ఫలితం లభించే సరుకులు మార్కెట్‌లో లభించడం లేదు. ప్రతి అడుగులో మోసం ఎదురు అవుతోంది. దీనిని ప్రభుత్వాలు ఏమాత్రం నియంత్రించలేకపోతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే రైతు నగదు బదిలీలు బడా రైతుల ఖాతాల్లో పడుతున్నాయి. నిజంగా క్షేత్రంలో రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమించే రైతులకు అందడం లేదు. దీనిపై ఏ ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. కోటీశ్వరులు ఇంకా ఆర్థికంగా బలపడుతున్నారు. పంట పొలాల్లో ఎండనక, వాననక పనిచేసే అన్నదాతలు మరింత ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటూ నామమాత్రపు ఆర్థిక సహాయాన్ని ఆ రైతు కుటుంబానికి అందించి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. ఈ విషయంలో కూడా అనేక నిబంధనలు పెట్టడంతో చాలా రైతు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడినా ఆశ్చర్యపోనక్కర్లేదు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుంది. సరైన ఆదాయం లేక రైతులు తమ భూములను రియల్‌ఎస్టేట్లకు అమ్ముకుంటున్నారు. ఆహార వస్తువుల కొరత ఏర్పడితే వాటి ధరలు కూడా అమాంతంగా పెరిగిపోతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అన్నదాతల విషయంలో దృష్టిసారించకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# ప్రేమే నేరమౌనా!

కవర్ స్టోరీ

సుంకవల్లి సత్తిరాజు

**ప్రతీ నిత్యం రాజకీయాల గురించి, రాజకీయ పక్షాల వాదోప వాదాలు, విమర్శలు, ప్రతి విమర్శల గురించి, వివిధ రంగాలకు చెందిన సెలబ్రిటీలు, వారి జీవితాల గురించి తారల అందచందాల గురించి, వారి వ్యక్తిగత ప్రేమ వ్యవహారాల గురించి, వివాహాలు, వివాదాలు, విడాకుల గురించి, అభిమాన హీరోల గురించి, టి.వి.సీరియళ్ల గురించి చర్చించుకుంటున్నాం.**

సమాజానికి ఏమాత్రం పనికిరాని ఇలాంటి విషయాలపై సుదీర్ఘ చర్చలతో కాలయాపన చేస్తున్నాం. అసలైన సమస్యలను గాలికి వదిలేస్తున్నాం. ఎప్పుడైనా, ఎక్కడైనా ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే కొద్ది రోజులు హడావిడి చేసి మరచిపోవడం సర్వసాధారణమైపోయింది. ఇకనైనా మన దృష్టికోణం మారాలి. మన ఆలోచనా సరళి సమాజ హితం దిశగా సాగాలి. మన మాటలు కోటలు దాటి చేతలు శూన్యం వైపు చూస్తే వాస్తవాలు మరుగు పడి అమాయకుల ఆర్తనాదాలు అరణ్య రోదనలా మారి, అరాచకవాదుల కబంధ హస్తాల్లో చిక్కుకుపోతాయి. ప్రజల్లో అవాంఛనీయ ఘటనలపై పోరాడే స్ఫూర్తి కరువైతే, జీవితాలే బరువైపోతాయి. అరాచకాలు పైచేయి సాధించి అమాయక జీవితాలు అర్థాంతర మరణాలకు దారి తీస్తాయి. తమ ప్రాణాలను తాము భద్రంగా కాపాడుకుంటూ, ఇతరుల ప్రాణాలను సునాయాసంగా బలి తీసుకుంటూ "హింస వచన-ధ్వంస రచన" సిద్ధాంతం ఆచరిస్తూ, అమాయకుల రుధిరంతో మానసిక ఆనందం పొందుతున్న ఆధునిక మానవ రూప పిశాచ గణాల ఆగడాలకు అంతం లేదా? మన భద్రత కోసం నిర్మించుకున్న విలువల సౌధాలు కుప్పకూలిపోతున్నాయి. లైంగికేచ్ఛతో రగిలిపోయి, రాక్షసత్వంతో రావణకాష్టం రగిలిస్తున్న కఠిన హృదయుల నిత్య మారణ హోమంలో భస్మీపటలమౌతున్న మానవత్వాన్ని, మానవ ధర్మాన్ని కాపాడే మహాత్ములు జన్మించాలని, దేవుడే దిగివచ్చి, ఇలలో నెలకొంటున్న హింసా ప్రవృత్తిని సంహరించి, అదృశ్యమౌతున్న నిజమైన మానవజాతిని కాపాడాలని కోరుకోవడం అత్యాశ కావచ్చునేమోగానీ, జీవించే అవకాశాలు అడుగంటి, జీవించాలన్న ఆశలు అడియాసలుగా మారిన నేటి మానవ మానసిక విధ్వంస పరిణామ క్రమాన్ని చూసి విస్తుపోయి, మనిషి మనిషిగా బతకాలన్న కనీస స్పృహగల ప్రతి ఒక్కరినీ ఆందోళనకు గురి చేస్తున్న సమాజంలోని ప్రస్తుత మానసిక ఉన్మాదాన్ని నిర్మూలించకపోతే జరగబోయే విపత్కర పరిణామాలు ఊహాతీతంగా ఉంటాయనడంలో అతిశయోక్తి లేదు. నిజమైన ప్రేమకు నిర్వచనం మరచి, లైంగిక ఉన్మాదాన్ని ప్రేమగా చిత్రీకరించుకుని, అందుకోసమే జీవితమన్నట్లుగా వేధించడం, హింసించడం చావడం, చంపడం లాంటి మానవ నైజానికి విరుద్ధమైన చర్యలు కొనసాగించడం ప్రేమల్లో చోటు చేసుకుంటున్న పైశాచికత్వానికి పరాకాష్ఠ.

ఇటీవలి కాలంలో మానవత్వాన్ని ప్రశ్నిస్తూ, దానవత్వాన్ని ఆవాహన చేస్తూ అత్యంత ఘోరంగా అప్రతిహతంగా కొనసాగుతున్న సంఘటనలు హృదయ విదారకంగా ఉంటున్నాయి. కారణాలు ఏవైనా వివిధ కారణాలతో చావడాలు, చంపడాలు వంటి సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరం. జరుగుతున్న అసహజ సంఘటనలు హృదయమున్న ప్రతీఒక్కరిని కనీసం క్షణకాలమైనా ఆలోచనకు ప్రేరేపించాలి. ప్రస్తుత సమాజంలో చోటు చేసుకుంటున్న విపరీత ధోరణుల గురించి, హత్యలు, అత్యాచారాలు, బలవన్మరణాల గురించి కూలంకషంగా, సమస్య లోతుల్లోకి వెళ్లి విశ్లేషించి, పరిష్కార మార్గాలను అన్వేషించాలి. దురదృష్టవశాత్తు అలాంటి విశ్లేషణలు కొనసాగడం లేదు. దాని ఫలితమే సమాజంలో జరగరాని సంఘటనలు పదే పదే పునరావృతమౌతున్నాయి. ఒకవైపు ర్యాగింగ్‌లు, మరోవైపు కామేచ్ఛతో వేధింపులు, ఇంకోవైపు విచ్చల విడి ప్రేమకలాపాలు, హత్యలు, అత్యాచారాలు, ఆత్మహత్యల వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. నచ్చినంత కాలం ప్రాణం ఇస్తానంటూ ప్రేమించి, మోహం మొత్తిన తర్వాత ప్రాణం తీసి, వేరేవారితో సహజీవనం చేసే ఊసరవెల్లుల్లాంటి అవకాశవాదుల నటనలో మోసపోతున్న వారెందరో ఆవేదనతో కుంగిపోతున్నారు. అంతరంగంలో చెలరేగే అల్లకల్లోలాన్ని తట్టుకోలేక, నిస్సహాయ స్థితిలో ప్రాణాలు వదిలేస్తున్నారు.

కొంతమంది పగతో రగిలిపోయి ప్రాణాలు తీస్తున్నారు. ఇలాంటి వ్యవహారాల్లో ఆడ, మగ అనే తేడా చూపలేం. మంచి-చెడులు ఇరువురిలోనూ ఇరు పార్శ్వాల్లా స్పృశించవచ్చు. కేవలం మగవారిని మృగాళ్లుగా చిత్రీకరించే సంస్కృతి విడనాడాలి. సమస్యను సమస్యగా చూడాలే తప్ప సమస్యలో లింగభేదం చూపకూడదు. ప్రేమ వ్యవహారాల్లోను, నమ్మించి మోసం చేయడంలోను, వేధించి చంపడంలోను, నేరాల విషయంలోను నేటి సమాజంలో స్త్రీ, పురుషులిరువురి పాత్ర వుంటున్న సంఘటనలు చూస్తున్నాం. కిరాతక చర్యలకు పాల్పడేవారు పురుషులైనా, స్త్రీలైనా శిక్షార్హులే. ఎవరి పట్లా సానుభూతి ప్రదర్శించనక్కరలేదు. ప్రేమ వ్యవహారాలు, అక్రమ సంబంధాలు యథేచ్ఛగా సాగుతున్న నేటి పాశ్చాత్య నాగరిక ప్రేరేపిత సమాజంలో స్త్రీ పురుష లిద్దరూ ఇష్టం లేకపోతే వదిలిపెట్టి, ఎవరి దారిలో వారు బతకడం శ్రేయస్కరం. చంపడం, చంపించడం, చావడం లాంటి ఘోరకృత్యాలకు పాల్పడడం దేనికి? నడుస్తున్న ప్రేమల చరిత్రలో వివాహానికి ముందు, వివాహం తర్వాత కూడా స్త్రీ పురుషుల మధ్య వ్యామోహంతోనో, అవ్యాజమైన ప్రేమతోనో లైంగిక సంబంధాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. అనివార్యమైన పరిస్థితుల నేపథ్యంలో సాగే వివాహేతర సంబంధాల విషయం చెప్పనలవి కాదు. వివాహానికి ముందే ఒకరితో సన్నిహిత సంబంధాలు కలిగివుండడం, కాలక్రమంలో అవి లైంగిక సంబంధాలకు దారి తీయడం, వేరేవారితో వివాహం జరిగినా వారి మధ్య సంబంధాలు కొనసాగడం వలన అనేక సంఘర్షణలు జరుగుతున్నాయి. అవి తీవ్రమైన మానసిక సంఘర్షణలకు దారి తీసి ప్రేమికుల్లోనో, భార్యాభర్తల్లోనో ఎవరో ఒకరు హత్య గావించబడడమో, ఆత్మ హత్యలకు పాల్పడడమో జరుగుతున్నది.

### సంచలనం రేపిన శ్రద్ధావాకర్ హత్య

గత సంవత్సరం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన శ్రద్ధావాకర్ హత్యోదంతం మానవ సమాజాన్ని తీవ్ర భయాందోళనలకు గురి చేసింది. మనిషిలో మేల్కొన్న మృగం రెచ్చిపోయి, పిచ్చిపట్టిన చందంగా తనను ప్రేమించి, తనతో సహజీవనం చేసిన శ్రద్ధావాకర్ అనే యువతిని అతికిరాతకంగా హత్య చేసిన సంఘటన ఇప్పటివరకు మహిళలపై జరిగిన హత్యా సంఘటనలకు భిన్నంగా జరిగిన ఒక ఉన్మాద క్రీడాకాండ లో ఒక వినూత్నమైన అధ్యాయానికి నాంది పలికినట్లయింది. ఈ దుస్సం ఘటన ద్వారా పైశాచికత్వంలో కూడా ఇంతటి దారుణమైన కోణం ఉంటుందా? అనే సంశయం మానవత్వమున్న ప్రతీ ఒక్కరిలో కలగడం సహజం. అఫ్తాబ్ పూనావాలా ఒక నరపిశాచం సాగించిన ఘోరకృత్యం గురించి ఇప్పటికీ అనేక కథనాలు వెలువడుతూనే ఉన్నాయి. తను ప్రేమించిన 27 సంవత్సరాల శ్రద్ధావాకర్‌ను చంపి రంపం, కత్తులను ఉపయోగించి ఆమె శరీరాన్ని 35 ముక్కలుగా కోసి, ఆమె ఎముకలను మిక్సర్‌లో వేసి, ఢిల్లీ వీధుల్లో చల్లి, చల్లగా జారుకోవాలని ప్రయత్నించిన అఫ్తాబ్



దేశవ్యాప్తంగా సంచలనం రేపిన శ్రద్ధావాకర్ హత్య, నిందితుడు అఫ్తాబ్

చివరికి చట్టంచేతికి చిక్కి జైలు ఊచలు లెక్కబెడుతున్నాడు. శ్రద్ధావాకర్‌ను చంపే ముందు ఆమెపై అత్యాచారం చేసి, ఆ తర్వాత ఆమెను భయానకమైన రీతిలో చంపి, ముక్కముక్కలుగా శరీర భాగాలను ఖండించి ఫ్రిజ్‌లో ఉంచి, వేరే యువతితో ప్రేమాయణం సాగించడం అఫ్తాబ్ సైకో చేష్టలకు పరాకాష్టగా అభివర్ణించవచ్చు. మంచి గ్రహించడం చేతగాని సమాజంలో చెడు మాత్రం శరవేగంతో వ్యాప్తి చెంది, తన ప్రభావం చూపెట్టడానికి వడివడిగా పరుగెడుతుందన్న సత్యం శ్రద్ధావాకర్ హత్యోదంతం నిర్ద్వంద్వంగా నిరూపించింది. భయంతో రోమాలు నిక్కబొడిచే ఈ సంఘటనను ప్రజలు మరువకముందే 'నిక్కీయాదవ్' దారుణ హత్య మరో కలకలం రేపింది. ఢిల్లీలో సాహిల్ గెహ్లాట్ అనే యువకుడు నిక్కీయాదవ్‌తో సహజీవనం చేస్తూ వేరే అమ్మాయితో పెళ్లి కుదుర్చుకున్నందుకు ప్రశ్నించిన నిక్కీని కిరాతకంగా హత్య గావించి, అఫ్తాబ్ మాది రిగానే హతురాలి శరీర భాగాలను ముక్కలు గా ఖండించి, మరుసటి రోజు వేరే అమ్మాయిని వివాహం చేసుకోవడం లైంగిక ఉన్మాదంతో రెచ్చిపోతున్న పిచ్చి పట్టిన సైకోల అకృత్యాలకు మరో ఉదాహరణ. విద్యాలయాల్లోను, ఉద్యోగాలు చేసే చోట కూడా మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవలి కాలంలో విద్యాలయాల్లో చోటు చేసుకుంటున్న సంఘటనలు అత్యంత ఆందోళనకరంగా ఉంటున్నాయి. నిజా నిజాలు పూర్తి స్థాయిలో వెలుగులోకి రావడం లేదు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసి, ఆదుకున్నంత మాత్రాన అన్యాయం సమసిపోదు. పోయిన వారిని తీసుకురాగలమా? అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ, డబ్బుతో సరిపెట్టుకుని హాయిగా బతకాలని సూచించే పెద్దరికం ఎందుకు? అవమానాలు, వేధింపులు భరించలేక తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారి ఆత్మలకు శాంతి కలగాలంటే ఆత్మహత్యలకు, హత్యలకు కారణమౌతున్న కఠిన కర్కశ పాషాణ సదృశమైన కిరాతకులకు కఠిన దండన అవసరం. విద్యాసంస్థల్లో యువతులను ఏడ్పించి, వారి బంగారు భవిష్యత్తును కాలరాసి, వారి ఆశల రెక్కలను కత్తిరించి, దారుణ పరాభవాలకు గురిచేసి చనిపోయేలా ప్రేరేపించడం విద్యాలయాల గౌరవాన్ని భ్రష్టు పట్టిస్తున్నది. విద్యాలయాల నిర్వాహకులు కూడా సైకోల ఆగడాలకు భయపడుతున్నారంటే, ఫిర్యాదులు చేసినా న్యాయం జరగడం లేదంటే పరిస్థితుల తీవ్రత ఏమిటో అవగతమౌతున్నది. ఇటీవల కాకతీయ వైద్య కళాశాలకు చెందిన మెడికో ప్రీతీ బలవన్మరణం అత్యంత విషాద అధ్యాయంగా మిగిలిపోయింది. ప్రీతి ఆత్మహత్య మహిళాలోకాన్ని, యువ విద్యార్థినులను తీవ్ర కలవరానికి గురి చేసింది. విద్యాలయాలకు అడుగుపెట్టడం అంటే నరకంలోకి ప్రవేశించడమేనన్న భయం ప్రీతి సంఘటన తర్వాత యువ తులను పట్టి పీడిస్తున్నది. కె.ఎం.సి.లో పి.జి.అనస్తీషియా విద్యార్థిని 'ధరావత్ ప్రీతి' సైకోగా మారిన తన సీనియర్ విద్యార్థి మహ్మద్ ఆలీ సైఫ్ ర్యాగింగ్‌కు బలైపోయింది. పలురకాలుగా

హింసించడంతో మనోవ్యాకులత చెంది ఆత్మహత్యకు పాల్పడింది. జనగాం జిల్లా గిర్నీ తండాకు చెందిన ప్రీతి ఎన్నో ఆశలతో జీవితంలోకి పైకి ఎదగాలని ప్రయత్నించింది. గిరిజన కుటుంబం నుంచి వచ్చిన ప్రీతి ఆశల సౌధాన్ని సైకో సైఫ్ కూల్చేసాడు. ఆమె ఆశల రెక్కలను కత్తిరించేశాడు. అవమానాలకు గురి చేసాడు. కులం పేరుతో హింసించాడు. గ్రూపు ఛాటింగ్‌లో తీవ్ర మనోవేదనకు గురి చేసాడు. డ్యూటీల విషయంలో ఆమె అనేక రకాలుగా క్షోభకు గురైనట్లు కథనాలు వెలువడుతున్నాయి. సీనియర్ పేరుతో మదమెక్కి తన పైశాచిక ఆనందం కోసం ఉజ్జ్వలమైన భవిష్యత్తుగల యువతి జీవితాన్ని ర్యాగింగ్ పేరుతో బలి తీసుకున్న ఉన్మాదిని ఉపేక్షించకూడదు.

సంవత్సరాల తరబడి న్యాయం కోసం ఎదురుచూసే పరిస్థితులు మారాలి. ఎక్స్‌గ్రేషియా పేరుతో న్యాయం జరగదు. బాధితురాలి ఆత్మ శాంతించదు. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు, వేధింపులు ఆగిపోవు. వెర్రితలలు వేసిన సైకో తత్వం సమసిపోవాలంటే ఉన్నత విద్యాలయాల్లో వికృత చేష్టలు ఆగాలంటే విద్యార్థులో సంస్కారం అలవడాలి. జూనియర్లను వేధించే సంస్కృతి అంతం కావాలి. ఉన్నత విద్యలతో రాణించవలసిన యువత ఆత్మహత్యలకు పాల్పడడం వెనుక కారణాలను సమగ్రంగా విశ్లేషించాలి. చెప్పడం తేలిక. అనుభవిం చిన వారికే పురిటి కష్టాలు తెలుసునన్న నానుడి మరవరాదు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారికి కేవలం కౌన్సెలింగ్ వలన ప్రయోజనం సమకూరదు.

విద్యాలయాల్లో చదువుకునే వాతావరణం ఏర్పడాలి. ఉన్నత విద్యాలయాల్లో విష సంస్కృతి రూపు మాపాలి.

జయశంకర్ భూపాలపల్లె జిల్లాకు చెందిన నర్సంపేట ఇంజినీరింగ్ విద్యార్థిని రక్షిత తన బాల్య స్నేహితుడైన రాహుల్ వేధింపులను తట్టుకోలేక ఉరివేసుకుని చనిపోవడం జరిగిందని, తన వ్యక్తిగత ప్రేమ వ్యవహారానికి సంబంధించిన ఫొటోలు లీక్ కావడం వలన పరువు పోతుందనే ఆందోళనతో రక్షిత సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయినట్టు వార్తలు వెలువడ్డాయి. నిజానిజాలు పూర్తి స్థాయిలో వెలుగులోకి రాకుండా మాట్లాడడం కూడా అంత సబబు కాదు.

ఏదేమైనా ప్రేమ వ్యవహారాలు ఇలా యుక్త వయస్సులోనే జీవితాలను చిదిమేయడం బాధాకరం.

ఇటీవల చోటు చేసుకున్న మరో ఆటవిక నాగరిక పర్వం ప్రకంపనలు సృష్టించింది. అబ్దుల్లాపూర్‌మెట్ సంఘటన ఒక భయంకరమైన ఆటవిక చర్యకు నాంది పలికింది. తను ప్రేమించిన అమ్మాయితో మాట్లాడుతున్నాడనే అనుమానంతో స్నేహితుడైన నవీన్ తల నరికి– తల, మొండెం వేరు చేసి, గుండెను చీల్చి హతమార్చిన హరిహర కృష్ణ పగ తీరక నవీన్ శరీర భాగాలను సైతం వేరు చేసి, ఫొటోలు దిగి విలయ తాండవమాడిన భయానకరమైన సంఘటన విన్నప్పుడు, పత్రికల్లో చదువుతున్నప్పుడు ఒళ్లు



గగుర్పొడిచింది. మనసంతా కలవరపాటుకు గురైంది. ప్రేమల కోసం స్నేహితులను సైతం చంపే సైకో జాతి అవతరించడం మారుతున్న మానవ స్వభావాల్లోని వికృత గుణాలకు అద్దం పడుతున్నది. వివాహేతర సంబంధాల కారణంగా హైదరాబాద్‌లో భర్తను చంపిన భార్య ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆటోడ్రైవర్ సురేష్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్న రేణుక మద్యానికి బానిస కావడంతో భర్త వేరే యువతితో సంబంధం కొనసాగించడం జరిగిందని, ఇది ఇష్టంలేని భార్య భర్తతో కలిసి మద్యం సేవించి, భర్త మెడకు చున్నీతో ఉరివేసి చంపి గోనెసంచిలో పెట్టిన ఉదంతం జీడిమెట్ల పి.ఎస్. పరిధిలో జరిగినట్లు వార్తా కథనాలు సూచిస్తున్నాయి. ఇక పరువుహత్యలకు రక్త సంబంధంతో పనిలేదు. చంపితే పోయిన పరువు తిరిగొస్తుందా? ఇష్టం లేకపోతే తమను వదిలిపెట్టిపొమ్మని చెప్పాలిగానీ ఇలా పరువు పేరుతో పేగుబంధాన్ని కత్తులకు, ఉరితాళ్లకు బలి ఇవ్వడం మూర్ఖత్వంలో నుండి నుండి పుట్టిన అమానుషత్వం.

కులాల పేరుతో హత్యలు చేయడం, తాము కన్నపిల్లలను తామే చంపుకోవడానికి వెనుకాడకపోవడం దానికి 'పరువు' అనే అందమైన పేరు పెట్టుకోవడం అవివేకం. తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగిన పరువుహత్య, ఇతర ప్రాంతాల్లో పరువుకోసం అంటూ జరుగుతున్న హత్యలు మూర్ఖపు వాదానికి సరికొత్త రంగు పులమడమే. నంద్యాల జిల్లా, ఆలమూరులో ప్రసన్న అనే యువతిని వారి కుటుంబ సభ్యులే గొంతుకోసి హత్య చేసారు. తాను ప్రేమించిన యువకుడితో కాకుండా వేరే అతనితో పెళ్లి చేయడం, అతనితో విభేదాలు రావడంతో ఆమె గంతో ప్రేమించిన యువడితో అక్రమ సంబంధం కొనసాగిస్తుందన్న నెపంతో ఆమెను గొంతు నులిమి చంపి తల, మొండెం వేరే చేసిన సంఘటన ఇటీవల సినిమా ఫక్కీలో జరిగింది. మన దేశంలో ఎన్నో పరువుహత్యలు జరిగాయి, జరుగుతున్నాయి. కొన్ని ఇస్లామిక్ దేశాల్లోను, మరికొన్ని ఇతర మత ఛాందసవాద దేశాల్లో కనిపించే పరువుహత్యలు మన దేశంలో కూడా జరగడం దురదృష్టకరం. పరువు హత్యలకు నిలయంగా ఇరాన్ పేరు గాంచింది. భారతీయ రాష్ట్రాల్లో పంజాబ్, ఢిల్లీ, హర్యానాల్లో పరువుహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో 20 ఏళ్ల యువతిని చంపి బియ్యంబస్తాలో పెట్టి యమునా నదిలో పడేశారు. ఇది వారి తల్లిదండ్రులు పరువుకోసం చేసిన ఘోరం.

లైంగిక దుశ్చర్యలకు వయసుతో సంబంధం లేదు. ఢిల్లీలో 11 సంవత్సరాల బాలికను లైంగికంగా చిత్రహింసలు పెట్టి, కొట్టి చంపిన ఉన్మాదం దేనికి సంకేతం? ఇదే ఢిల్లీలో మూడు సంవత్సరాల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడు బోధించే నీతి ఏమిటి? ఉత్తరప్రదేశ్‌లో 2022వ సంవత్సరంలో 15, 17 సంవత్సరాల వయసుగల ఇద్దరు అక్కా చెల్లెళ్లు అత్యాచారానికి గురై ఒక చెట్టుకు వేలాడదీయబడిన సంఘటన విదితమే. అలాగే దేశంలో పలుచోట్ల అనేకమంది యువతులు అత్యాచారాలకు గురై, భరించలేక ఉరేసుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. పెళ్లికి ముందు పరిచయాలు, ప్రేమలు, వివాహేతర సంబంధాలకు కారణమౌతున్నాయి. ఎన్నో రకాల హత్యలకు ప్రేమ కారణం విశేషం.

ఇటీవల బెంగళూరులో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన లీలాపవిత్ర అనే యువతి శ్రీకాకుళం జిల్లాకు చెందిన దినకర్ అనే ప్రేమికుడి చేతిలో దారుణ హత్యకు గురి కావడం జరిగింది. ఉన్నత విద్యావంతురాలైన ఆ యువతి ఉద్యోగరీత్యా బెంగళూరులో ఉంటున్నది. యువతి కుటుంబ సభ్యులు కులం కారణంగా వీరి ప్రేమకు నిరాకరించడం, కుటుంబ సభ్యుల సలహాతో ప్రేమికుడైన దినకర్‌ను దూరంగా పెట్టినందుకు భగ్నప్రేమికుడై, ఉన్మాదిగా మారిన దినకర్ లీలాపవిత్రను కత్తితో పదహార్లు పొడిచి, పాశవికంగా హత్య చేసాడు. అనునిత్యం ఇలా ప్రేమల పేరుతో హత్యలు జరగడం సర్వసాధారణంగా మారిపోయింది. ఇకనైనా ఈ హత్యాకాండకు ముగింపు పలకాలి. ప్రేమలు జీవితంలో ఒక భాగం మాత్రమే, కానీ ప్రేమలు మాత్రమే జీవితం కాదన్న విషయాన్ని యువతీ యువకులు గుర్తించాలి. ఇటీవల బీహార్‌లో జరిగిన సంఘటన ఆశ్చర్యం కలిగించకమానదు. ముఖేష్, నీరజ్ అనే వ్యక్తులు ఒకరి భార్యను మరొకరు అపహరించి పెళ్లి చేసుకున్నారు. ఇదో రకమైన ప్రేమ వ్యవహారం. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కంచికచర్లలో భార్య వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించిన భర్తను ప్రియుడి సహకారంతో భర్త ముఖానికి ప్లాస్టిక్ కవరు తొడిగి ఊపిరాడకుండా చేసి చంపిన ఘటన జరిగింది. ఒక్కో సంఘటన ఒక్కో రకమైన రూపం సంతరించుకుని వికృత నాట్యం చేస్తున్నది.
కేరళలోని ఎలంతూర్‌లో షఫీ అనే ఒక సైకో చేష్టలకు ఇద్దరు యువతులు బలైపోయిన ఉదంతం మన స్మృతిపథం నుండి చెరిగిపోలేదు. ఈ అరాచక ప్రక్రియలో ఇద్దరు యువతుల్లో ఒకరి శరీరాన్ని 56 ముక్కలుగా కోసి, ఉడికించుకుతిని, మిగిలిన భాగాలను ఇంటి ఆవరణలోని వివిధ చోట్ల పాతి పెట్టినట్లు కొన్ని కథనాలు చెబుతున్నాయి. ఇలా ఎన్నో మరెన్నో అకృత్యాలు విశృంఖలంగా కొనసాగుతున్నాయి. కులం పేరుతో, ప్రేమల పేరుతో అక్రమ సంబంధాల పేరుతో, లైంగిక వేధింపుల పేరుతో, ర్యాగింగ్ పేరుతో సాగుతున్న అరాచకాలు మానవత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. కేంద్ర హోంశాఖ పర్యవేక్షణలో కొనసాగుతున్న "నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో" (ఎన్.సి.ఆర్.బి) పాత నివేదిక ప్రకారం 2020తో పోల్చి చూస్తే 2021లో మహిళలపై అరాచకాలు 15 శాతం పైగా పెరిగాయని అంచనా. అస్సాంలో అధిక శాతం అంటే 168 శాతం పైగా మహిళలపై అరాచకాలు కొనసాగుతున్నాయి. దేశంలో ప్రతీ లక్ష మంది జనాభాలో 64.5 శాతం మహిళలపై అకృత్యాలు జరుగుతున్నాయి. నాలుగు లక్షలకు పైగా మహిళలపై వివిధ రూపాల్లో హింస కొనసాగుతున్నది. మహిళలపై కిడ్నాపులు పెరిగాయి. అస్సాంలో ప్రతీ లక్ష మందిలో 76 పైగా కేసులు మహిళలకు సంబంధించినవే. హింసాత్మక నేరాల పెరుగుదలలో ఒడిస్సా అగ్రస్థానంలో ఉంది.లైంగిక హింస కూడా 2021తో పోల్చి చూస్తే 2022లో పెరిగినట్లు తెలుస్తున్నది. వర్క్ ఫ్రమ్ హోం వలన మహిళలపై హింస కొంతవరకు తగ్గినా, తిరిగి పెరుగుతున్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. 'నేషనల్ క్రైమ్ బ్యూరో' నివేదిక ప్రకారం దేశ రాజధానిలో సగటున



ఆత్మహత్యకు పాల్పడిన డాక్టర్ ప్రీతి

ఇద్దరు మైనర్లు అత్యాచారానికి గురౌతున్నారు. మహిళలకు సంబంధించిన కేసులు 13 వేలకు పైగా ఉన్నాయి. ఇండియన్ పీనల్ కోడ్, పోక్సో చట్టాలు, అట్రాసిటీ చట్టాలు, యాంటీ ర్యాగింగ్ నిరోధక చట్టాలు ఇలా.. ఎన్నో మనుగడలో ఉన్నా నేరాలు పెరుగుతూనే ఉన్నాయి.
ఆడవారిని ఆదిశక్తిగా పూజించే రోజులు పోయాయి. పురాణ కాలంనాటి సతీసహగ మన దురాచారం ఎంతో మంది సంఘసంస్కర్తల కృషితో అంతమైనా వేరే రూపంలో స్త్రీలపై అరాచకాలు విశృంఖలం గా కొనసాగుతున్నాయి. నిరక్షరాస్యత ప్రబలంగా ఉండి, మంచేదో, చెడేదో తెలియని నాటి కాలంలో, స్త్రీ విద్యను అపరాధంగా భావించే సాంప్రదాయం సమాజంలో బలంగా వేళ్లూనుకున్న కాలంలో కూడా ఇప్పుడు జరుగుతున్న పాశవిక సంఘటనలు జరిగి ఉండవేమో అనిపిస్తున్నది. స్త్రీ, పురుష లింగ వివక్షత నశించి అందరూ విద్యావంతులుగా మారుతూ, అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా, కొన్ని సందర్భాల్లో పురుషుల కంటే మిన్నగా రాణిస్తున్నారు. విద్యావేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా, వ్యాపార, సినీ, రాజకీయ రంగాల్లో మహిళలు విశేషంగా రాణిస్తున్న నేపథ్యంలో ఇంకా స్త్రీలపై అరాచకాలు కొనసాగడం అనాగరికం. ఎందుకిలా జరుగుతున్నది? మహిళలపై సాగే ఆధునిక హింసాకాండకు ముగింపు లేదా? ప్రేమల పేరుతో వంచించడం, హింసించడం, వేధించి హతమార్చడం వంటి వేటాడే మృగాల సంస్కృతికి ప్రేరణ ఏమిటి? లైంగిక వాంఛల పేరుతో సాగే రాక్షసత్వం ఎందుకు ప్రబలిపోతున్నది? ఉన్మాదులుగా మారి, ఉగ్రరూపం ప్రదర్శిస్తూ స్త్రీలను బలవంతంగా లొంగదీసుకోవడం, వీలుగా కపోతే పాశవికంగా అత్యాచారాలకు ఒడిగట్టడం, నిజం తెలుస్తుందన్న నెపంతో కిరాతకంగా చంపడం, చంపడంలో కూడా పైశాచిక ఆనందం పొందడం వంటి కన రాని, వినరాని భయానక సంఘటనలు నేటి ఆధునిక వ్యవస్థలో కొనసాగడం తిరోగమనమా? పురోగమనమా? జంతువులను వేటాడి, సంహరించి, ఆకలి తీర్చుకునే ఆటవిక వాదం కంటే దారుణమైన దుఃఖభరితమైన అరాచక సంస్కృతి తాండవించడం దేనికి సంకేతం? లైంగిక పరమైన కోరికల కోసం పశువులు కూడా ఇలా వెంటాడవు, సంహరించవు. ఉన్మాదంతో స్త్రీలను అనుభవించి, శవాలను కూడా వదలకుండా లైంగిక వాంఛలను తీర్చుకోవడం మారుతున్న మానవ వికృత నైజానికి మరో రూపం. అత్యంత కిరాతకమైన రాక్షసజాతి పునరావృతం కాబోతున్నది. భారతీయ సాంప్రదాయంలో వైవాహిక వ్యవస్థకున్న విశిష్ఠత మరే ఇతర దేశంలోను లేదు. గతంలోను, ప్రస్తుతం కూడా చాలా మంది స్త్రీలు వివాహ వ్యవస్థకున్న పవిత్రతకు కట్టుబడి తమ ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారు. గృహిణిగా ఎనలేని గౌరవం ప్రదర్శిస్తున్నారు. పిల్లల పెంపకంలోను, కుటుంబ బాధ్యతల విషయంలోను మహిళల పాత్ర అనిర్వచనీయం.

భారతదేశం విలువలకు పుట్టినిల్లు. ఒకప్పటి భారతీయ సాంప్రదాయాల్లోను, విద్యా విధానంలోను, స్థూలంగా చెప్పాలంటే భారతీయ జీవన విధానం విలువల ప్రాతిపదికన కొనసాగేది. కాలక్రమేణా అనేక మార్పులు సంభవించాయి. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వివిధ దేశాల నడుమ దూరం తగ్గించేసింది. ప్రపంచం ఒక కుగ్రామంగా రూపాంతరం చెందిన నేపథ్యంలో వివిధ దేశాల నాగరికతలు, ఆచార వ్యవహారాలు ప్రపంచ ప్రజలకు చేరువైనాయి. భారతదేశం కూడా పాశ్చాత్య నాగరికతా ప్రవాహంలో మమేకమై పరుగులు పెడుతున్నది. ఇతర దేశాల నాగరికత పట్ల మోజు పెంచుకుంటున్న యువతీ యువకులు అనాదిగా వస్తున్న భారతీయ విలువలను పక్కన బెట్టి, స్వేచ్ఛ కోసం పరితపించడం మొదలుపెట్టారు.

స్త్రీ, పురుషుల మధ్య స్నేహం తప్పు కాదు. కలిసి మెలిసి లింగ వివక్షత లేకుండా పనిచేయడం నేరం కాదు. అయితే మారుతున్న కాలంలో మానవ సంబంధాలు తప్పుదారి పడుతున్నాయి. మన కోసం మనం ఏర్పాటు చేసుకున్న కట్టుబాట్లు, నీతినియమాలు పట్టు తప్పిపోతున్నాయి. విలువలు పతనావస్థకు చేరిపోతున్నాయి. కుటుంబ సంబంధాలు, చుట్టరికాలు, స్నేహ సంబంధాల మధ్య అగాథం ఏర్పడింది. మంచి-చెడుల మధ్య సరిహద్దు రేఖ చెరిగిపోయింది. చిన్న చిన్న పరిచయాలు స్నేహాలుగా; స్నేహాలు ప్రేమలుగా మారిపోతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా వ్యక్తుల మధ్య ప్రేమ సంబంధాలు కొనసాగుతున్నాయి.

చదువుకునే వయసులో, ఉద్యోగాలు చేసే చోట కళాశాలల్లోను, విశ్వవిద్యాలయాల్లోను ప్రతీచోట ప్రేమ కార్యకలాపాలు జోరందుకుంటున్నాయి. వివాహేతర సంబంధాలు కూడా విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. మనం నిర్దేశించుకున్న సూత్రాలు కాలక్రమంలో తప్పుగా అనిపిస్తున్నాయి. పశుపక్ష్యాదుల్లో లేని నియమాలు మనకెందుకన్న ఆలోచనల ప్రారంభమయింది. స్వేచ్ఛగా జీవించాలనే తాపత్రయం మొదలైంది. స్వేచ్ఛ పేరుతో కొనసాగుతున్న సంబంధాలు దాదాపుగా లైంగిక సంబంధాలకు దారి తీస్తున్నాయి. అయితే ఈ సంబంధాలు కూడా కాలక్షేపం కోసమో, లైంగిక వాంఛలు తీర్చుకోవడం కోసమో ప్రారంభమై, ఒప్పులోనే కాదు తప్పులో కూడా నిజాయితీ కరువై అర్థాంతరంగా ముగుస్తున్నాయి. చదువు సంస్కారం నేర్పాలంటారు. విద్య వివేకం నేర్పాలంటారు. విచక్షణ లేకుండా మధ్యలో పుట్టి, మధ్యలో ఆగిపోయే సంబంధాల కోసం ఎన్నో జీవితాలు బలైపోతున్నాయి. మంచినీళ్లు తాగినంత సులభంగా ప్రేమలు కూడా పెళ్లిపీటలెక్కకుండా ఆగిపోతున్నాయి. ఎలాగైనా జీవితాన్ని సరదాగా గడిపేయాలి అనే మార్గాన్ని ఎంచుకున్న యువత శృంగార కార్యకలాపాలతో, మందు, విందు మైకంతో చెలరేగిపోయి, జీవితాన్ని చాలా సరదాగా తీసుకుంటున్నది. సాంకేతిక పరిజ్ఞానం వలన సమకూరిన సదుపాయాలతో, హద్దూ,



అదుపూ లేని పాశ్చాత్య ప్రభావంతో లైంగిక వాంఛల్లో మునిగి తేలుతున్నారు. డేటింగ్‌ల పేరుతో కాలక్షేపం చేయడం, ఆ తర్వాత తమ మనసులు కలవలేదనే నెపంతో అత్యంత సులభంగా బ్రేకప్‌లకు తెరలేపుతున్నారు. ఇందులో ధనికులు, పేదలు అనే తారతమ్యం లేదు. లింగ భేదం లేదు. కేవలం సరదాల కోసమే సంబంధాలన్నట్లుగా సాగే ప్రేమ వ్యవహారాలు నేటి సమాజంలో అత్యంత సాధారణంగా మారిపోయాయి. ఈ వ్యవహారంలో సున్నితమైన మనస్కులు ప్రేమ చేసిన గాయాలను తట్టుకోలేక పిచ్చివాళ్లుగా మారిపోతున్నారు. మరికొంత మంది సున్నితమైన మనస్కులు మనసును చంపుకోలేక మరణాన్ని ఆశ్రయిస్తున్నారు. కొంతమంది సైకోలుగా మారి, ప్రేమ దక్కలేదనే నెపంతో యాసిడ్ దాడులకు, అత్యాచారాలకు, హత్యలకు పాల్పడుతున్నారు. అయితే దేశానికి ఉపయోగపడవలసిన యువత, దేశాభివృద్ధిలో కీలక భాగస్వామ్యం పోషించవలసిన విద్యావంతులు సైతం ఆత్మహత్యల వైపు ప్రేరేపించబడుతున్నారంటే దానికి గల కారణాలను అవగతం చేసుకోవాలి. సమస్య తీవ్రతను గుర్తించి, ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయాలి. ప్రేమల పేరుతోనో, పైశాచికానందం కోసమో యువతులను వేధించి, వారి అర్థవంతమైన జీవితాలకు అర్థాంతరంగా ముగింపునిస్తున్న మానసిక ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి. ఆర్థిక స్థోమత లేకపోయినా అనేక కష్టాలుపడి, విద్యాలయాల్లో అడుగుపెట్టి, ఉన్నత విద్యలను అభ్యసించి, సమాజంలో తమకంటూ ఒక గుర్తింపును, గౌరవాన్ని సంపాదించుకుని, ఆర్థికంగా నిలదొక్కుకుని, ఆదర్శంగా నిలవాలనే ప్రయత్నంతో ఎన్నో ఆశలు పెంచుకున్న యువతులను ర్యాగింగ్‌ల పేరుతో హింసించడం జీవితాన్ని ముగించే విధంగా మానసిక క్షోభకు గురిచేయడం ఆటవిక పశుప్రవృత్తికి పరాకాష్ఠ. విద్యాలయాలు ఉత్తమమైన భవిష్యత్తుకు వేదికలు కావాలి. యమకూపాలుగా మారకూడదు.

విద్యాబుద్ధులు నేర్పవలసిన ప్రొఫెసర్లు కూడా ర్యాగింగ్ చేసే విద్యార్థులకు భయపడడం, యువతులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం పోలీసు కేసులు కూడా ప్రాణాలను కాపాడలేకపోవడం దారుణం. ప్రేమ అనేది ఒక సున్నితమైన, అద్భుతమైన భావన. భావోద్వేగాలతో నిండిన ఒక మధురమైన అనుభూతి. అయితే ఒకప్పటి ప్రేమబంధాలకు, నేటికి హస్తమశకాంతమంత వ్యత్యాసముంది.

బతికున్నంత కాలం తమ ప్రేమను బతికించుకోవాలనే తాపత్రయంతో ప్రేమబంధాన్ని పవిత్రంగా భావించే కాలం పోయింది. ప్రేమంటే ఒక సరదా. ప్రేమంటే శారీరక సుఖాల కోసం ఏర్పడిన ఒక అవకాశవాద బంధంలా మారిన నేపథ్యంలో ప్రేమ భావన ఒక నాటకంగా మారిపోయింది. ప్రేమలో ఆర్థికపరమైన అంశాలు ఇమిడి ఉంటున్నాయి.

**(మిగతా 12వ పేజీలో)**

# త్రిమూర్తి స్వరూపిణి 'శ్రీ పటాన్‌దేవి'



ఆలయ దర్శనం

**దైవ** భూమి అయిన భారతదేశంలో ఎన్నో ప్రాంతాలు స్థానికంగా కొలువైన దేవి లేదా దేవతల పేరు మీద ఏర్పడటం అందరికి తెలిసిన విషయమే. భూలోక వైకుంఠం శ్రీరంగం, కలియుగ వైకుంఠం తిరుమల, శ్రీ అనంత పద్మనాభ స్వామి కొలువైన తిరువనంతపురం.. ఇలా ఎన్నో ఉదాహరణలు పేర్కొనవచ్చు. వాటిలో గతంలో మన పురాణాల్లో, చరిత్ర గ్రంథాల్లో 'మగధ'గా పేర్కొన్న ఇప్పటి బీహార్ రాజధాని 'పట్నా' పేరు కూడా చేర్చవచ్చు.
'పుత్రకు'నిగా పేర్కొనబడే పాలకుని చేత స్థాపించబడిన 'పాటలీపుత్ర' నేటి 'పట్నా'గా మార్పు చెందడానికి వెనుక విశేష పౌరాణిక, చారిత్రక గాథలు ముడిపడి ఉన్నట్లు తెలుస్తోంది.
దక్ష ప్రజాపతి గురించి అందరికీ తెలిసిన విషయమే! ఆయన పుత్రిక సతీదేవి తండ్రి మాటను కాదని శ్మశానవాసి అయిన శంకరుని పరిణయమాడటం వల్ల తండ్రి నిరాదరణకు గురైంది.
సర్వేశ్వరుని కించపరచడానికి తలపెట్టిన యాగమనీ, తమకు పిలుపు లేదని తెలిసీ దాక్షాయణి వెళ్లి దక్షుడు చేసిన అవమాన భారం తట్టుకోలేక హోమగుండంలో దూకి ఆత్మత్యాగం చేసింది.
ఈ విషయం తెలిసి ఆగ్రహించిన మహేశ్వరుడు వీరభద్ర, కాలభైరవాది గణాలను పంపి దక్ష యజ్ఞాన్ని భగ్నం చేయించడం అసలు కథ.. ఇదే దక్ష యజ్ఞం.
సతీదేవి దూరమవడంతో విచారగ్రస్తుడైన పరమేశ్వరుడు ఆమె దేహాన్ని భుజం మీద వేసుకొని విరాగిగా మారి లోకాలలో సంచరించసాగాడు.
అమ్మవారి శరీరం ఆయనకు కనిపించినంత కాలం మామూలుగా మారరని గ్రహించిన శ్రీహరి సుదర్శన చక్రంతో సతీదేవి దేహాన్ని ఖండించారు. ఆ భాగాలు భువిలో అనేక ప్రాంతాలలో పడ్డాయి. అవే శక్తిపీఠాలు. వీటిల్లో ప్రముఖమైనవి అష్టాదశ శక్తిపీఠాలు. మిగిలిన భాగాలు పడిన 51 ప్రదేశాలను సిద్ధ శక్తి పీఠాలు అని పిలుస్తారు. ముఖ్యమైన నాలుగు శరీర భాగాలు పడిన వాటిని మహా శక్తిపీఠాలు అని పిలుస్తున్నారు.
అమ్మవారి కుడి తొడ నేటి పాట్నా నగరంలోని మహారాజ్ గంజ్ దగ్గర, సతీదేవిపై వస్త్రం చౌక్ వద్ద పడిందట. పాలకుడైన పుత్రకుడు అమితంగా అమ్మవారిని ఆరాధించేవాడు. సర్వకాలాలలో తనను కాపాడే దేవతకు ఆయనే ఆలయాలు నిర్మింపచేసారు. మహారాజ్ గంజ్‌లోని బడీ పటాన్‌దేవి ఆలయం, చౌక్ వద్ద చోటీ పటాన్‌దేవి ఆలయాలు ఉంటాయి.
ఇలా రెండు చోట్ల కొలువైన అమ్మవారిని భక్తులు సంపూర్ణ విశ్వాసంతో ఆరాధిస్తారు. చిత్రమైన విషయం ఏమిటంటే రెండు చోట్లా ఒక్క అమ్మవారే ఉండరు.
గర్భాలయంలో రజత సింహాసనం మీద మూడు చిన్న సాలగ్రామ శిలలు ఉంటాయి. మూడు శిలలు మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతిగా పేర్కొంటారు. అమ్మవారు త్రిశక్తి స్వరూపిణి.
పుత్రకుడు కొలిచిన దైవంగా, పాటలీపుత్ర రక్షకురాలిగా అమ్మవారిని శ్రీపటాన్‌దేవి అని గౌరవంతో పిలిచేవారు. ఆ విధంగా అమ్మవారి పేరు మీద పురం 'పట్న'గా పిలవబడుతోంది.



బడీ పటాన్‌దేవి మందిర ప్రాంగణంలో ఉపాలయాలలో లింగరాజు, హనుమంతుడు, భైరవుడు కొలువై ఉంటారు. ప్రతిరోజూ భక్తులు అమ్మవారి దర్శనార్థం వస్తుంటారు. మంగళవారాలలో వీరి సంఖ్య చాలా అధికంగా ఉంటుంది. పర్వదినాలలో వేలాది మంది రాష్ట్రం నలుమూలల నుండి వస్తారు. నవరాత్రులూ, శివరాత్రి, హనుమజ్జయంతి లాంటి రోజులలో



విశేష అలంకారాలు, పూజలు నిర్వహిస్తారు.
పట్నా పాత నగరంలో ఉన్న ఈ ఆలయం ఉత్తర దిశగా దుకాణాల, గృహాల నడుమ ఉంటుంది. బడీదేవి ఆలయంతో పోలిస్తే చాలా చిన్న మందిరం.
ఇక్కడ కూడా ముగ్గురమ్మలు కొలువై ఉంటారు.
పక్కనే పురాతన సిక్కు గురుద్వారా, మహమ్మదీయులు మసీదు కూడా ఉంటాయి. వీటి నిర్మాణశైలి అబ్బురపరుస్తుంది. ఇవి కూడా చరిత్ర కలిగినవి కావడం విశేషం.
పట్నాలో తప్పనిసరిగా సందర్శించవలసిన మందిరాలలో బడీ, చోటి పటాన్‌దేవి మందిరాలు కూడా ఉన్నాయి. పట్నా రైల్వే స్టేషన్ నుండి ఆటోలలో సులభంగా మొదట బడీదేవి



తరువాత చోటీదేవి ఆలయాలను చేరుకోవచ్చు. మార్గంలో మాశీతలాదేవి మందిరం కూడా దర్శనీయ స్థలం.
నవరాత్రుల తొమ్మిది రోజులు విశేష సంఖ్యలో అమ్మవార్లను సేవించుకోడానికి రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు తరలి వస్తారు. ప్రత్యేక పూజలు, అలంకరణలు అమ్మవార్లకు జరుపుతారు.
ఈ మందిరాలన్నీ ఉదయం ఆరు గంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకు భక్తజన సౌకర్యార్థం తెరిచి ఉంటాయి.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

# ప్రేమే నేరమౌనా!

**(10వ పేజీ తరువాయి)**

క్షణికావేశాలు, సుఖజీవనం కోసం పన్నే వ్యూహాలతో ప్రేమ సున్నితమైన భావన కోల్పోయింది. కొంతమంది అమాయక యువతీ యువకులు ప్రేమపాశంలో చిక్కుకుని బయటపడలేక, ప్రేమ విఫలమైతే, ప్రేమించినవారు వంచన చేస్తే తట్టుకోలేక తీవ్రమైన మానసిక ఉద్రేకానికి లోనౌతున్నారు. ఇందులో గొప్పవారు, తక్కువవారు అనే తేడా లేదు.
అబ్బాయిలు, అమ్మాయిలు అనే భేదభావం చూడకూడదు. ఉభయుల్లోను మోసం చేస్తున్నవారు, మోసపోతున్నవారువారు కోకొల్లలు. లేని ప్రేమను సృష్టించి, అబద్ధాలతో ఎదుటివారి హృదయంలో ప్రేమబీజాలు నాటి, అది తీవ్రమైన మానసిక బంధంగా పరివర్తన చెందిన దశలో వివిధ కారణాల సాకుతో ప్రేమరెక్కలను ఖండించి, నీ దారి నీదే, నా దారి నాదే అంటూ మధ్యలో వదిలేసి పోవడం వలన ఏర్పడిన అత్యంత తీవ్రమైన మానసిక సంక్షోభానికి ఔషధాలు, కౌన్సెలింగ్‌లు కూడా పరిష్కారం చూపని పరిస్థితుల్లోకి సమస్య జారిపోతే, హృదయం బద్దలై, హృదయంలో చెలరేగే అల్లకల్లోల బడబాగ్ని జ్వాలలను నిలువరించలేక ఆత్మహత్యలకు పాల్పడేవారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం.
ప్రేమ జీవితంలో ఒక భాగం మాత్రమే, అదొక్కటే జీవితం కాదు అనే విషయాన్ని యుక్తవయసు విద్యార్థులకు నేర్పాలి. ప్రేమ కంటే జీవితం గొప్పదన్న సత్యం వివరించాలి. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, ఎవరు ప్రేమ పేరుతో మోసం చేసి, తమ దారి తాము చూసుకున్నా, తమను నమ్ముకుని తమ కోసమే జీవిస్తున్న పెద్దల ఆశలను అడియాసలు చేసి, వారిని నట్టేట ముంచి, ఆత్మహత్యలకు పాల్పడే యువతను సంస్కరించాలి. ర్యాగింగ్‌ల పేరుతో తీవ్రంగా హింసించి, వేధించడం, సామాజిక మాధ్యమాల్లో పరువు తీసే వీడియోలు పెడతామంటూ బెదిరించడం వలన చాలా మంది అమ్మాయిలు సమాజంలో బతకలేని తీవ్రమైన సంకట స్థితికి నెట్టబడుతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అమ్మాయిల చేతిలో ప్రేమ పేరుతో మోసపోయి, నిస్సహాయ స్థితిలో మరణాన్ని ఆశ్రయిస్తున్న అబ్బాయిల సంగతి కూడా మనం ఆలోచించాలి. ప్రేమించి, మోసం చేసి వేరొకరితో ప్రేమాయణాలు కొనసాగించడం ఎంతవరకు సబబు? దీనికి కారణం ఏమిటి? గుడ్డిగా నమ్మి మోసపోవడమా? కల్లబొల్లి కబుర్లకు లొంగిపోవడమా? మానసిక పరిపక్వత లేకపోవడమా? పాతిక, ముప్ఫై సంవత్సరాల వయస్సుగల యువతలో మానసిక పరిపక్వత లేకపోవడం ఏమిటి? కెరీర్ కంటే, కన్నవారి కంటే ప్రేమ గొప్పదనే భావాన్ని యువత మదిలో బలంగా నాటిన సినీ, టివి, సామాజిక మాధ్యమాలదా? తప్పెవరిది? శిక్షవరికి? ఒక్కసారి క్షుణ్ణంగా ఆలోచన చేయాలి. సమాజంలో విలయతాండవం చేస్తున్న ప్రేమోన్మాదానికి అంతం పలకాలి. జీవితం గురించి పరిపూర్ణమైన అవగాహన కలిగించాలి. మానవ సంబంధాలు, విలువలు, మానవత్వం వంటి అంశాలకు పాఠ్యపుస్తకాలకు అగ్రతాంబూలమివ్వాలి. ఆనాడే జీవితమంటే నిజమైన నిర్వచనం లభిస్తుంది. వర్తమానంలో జరిగే అవాంఛనీయ సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా నిలువరించడానికి అవకాశం ఏర్పడుతుంది. ❍






## 'శ్రీత్రికూటేశ్వర త్రిశతి శ్రీరాజరాజేశ్వరీ శతకము'

ఈ పుస్తక రచయిత శ్రీదక్షిణామూర్తిశాస్త్రి కృషితోపాటు త్రిశతి భావములు. రచయిత దెందుకూరి దుర్గా ప్రసాదశాస్త్రి, గ్రంధ సంపాదకులు అంబటిపూడి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రిల కృషి ప్రముఖమైనది. శ్రీషిర్డి సాయిబాబా ట్రస్ట్ సాహితీరేఖల (చందూరు) సంస్థల సంయుక్త ప్రచురణ ఇది. దొడ్లేటి సచ్చిదానంద సరస్వతిస్వామి వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, యార్లగడ్డ బాలగంగాధరరావు, చింతలపాటి నరసింహదీక్షితశర్మ, రామదుగు వెంకటశ్వరశర్మ, మల్లాప్రగడ శ్రీమణారాయణమూర్తిలాంటి పెద్దల అభినందనలతో కూడిన ముందుమాటలున్నాయి. ఈ పద్యాల్లో భారతీయ సంస్కృతితో కూడినభక్తి భావసంభరితమైన పద్యధారణతో సాగాయి. రామదుగు వారు అన్నట్లుగా అక్షరాత్మకమైన చలివేంద్రంగా మారింది వీరి శతకరచన. రాజరాజేశ్వరి శతకము లలితాసహస్రనామ భావార్థాల్ని నిక్షిప్తం చేసుకున్న రచన, పూజల యాంత్రికంగా చేసే ప్రక్రియ కాదని తాదాత్మ్యం, భావనాశక్తి ప్రాథమిక లక్షణాలంటారు ఈ కవి. మునిశ్రేష్టుమైన లోపాముద్ర ఆగస్త్యులకు హయగ్రీవుడు లలితాదివ్య సహస్రనామ రహస్య విశేషముల్ని బోధించిన అంశాలు పద్యంలో చెప్పారు. (పే.211). కవి అక్షర ఋషిగా కనిపిస్తాడు.

**(శ్రీత్రికూటేశ్వర త్రిశతి శ్రీరాజరాజేశ్వరీ శతకము, పద్యరచన: డా॥తూములూరి దక్షిణామూర్తిశాస్త్రి, వెల: రూ 150, ప్రతులకు: దేసు గణేష్‌కుమార్, ప్లాట్ నం.4, హనుమాన్ దేవాలయం, కొత్తపేట, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**

## అశృవులను కారుస్తున్న 'ఆసు'



పద్మశాలీ కుటుంబం నుండి ఎదిగివచ్చిన విద్యాధికుడు, ఆంధ్రోపన్యాసకుడు డా॥వెల్దండి శ్రీధర్ చేనేత వృత్తికి ఆయువు పట్టయిన 'ఆసు' ప్రాముఖ్యతను వివరిస్తూ 'ఊచ నుండి దారాన్ని పీల్చగమంటే/ దేహం నుండి ప్రాణవాయువును త్యాగం చేయడమే/ నాగలి లేనిదే పంటను తీయలేనట్లు/ 'ఆసు' లేనిదే బట్టను నేయలేం' అంటాడు. 'ఇప్పుడు, 'ఆసు' మౌనంగా అశృవులను కారుస్తోంది' అంటూ ఒకే ఒక్క వాక్యంలో ఈవృత్తిని నమ్ముతున్న లక్షలాది కుటుంబాల దైనపరిస్థితికి అద్దం పట్టాడు. నేత కార్మికుల శ్రమజీవన సంగీతాన్ని కడుపునృద్యంగా తన కవితల్లో వినిపిస్తాడు. 'ప్రశ్నను జైల్లో పెట్టి.. కాదంటే హత్యచేసి నిలదీసే గొంతుకలకు సమాధులు నిర్మిస్తోంది' ఎవరు? రాజ్యం!! 'ఇక భావ ప్రకటనా స్వేచ్ఛను కోల్పోయిన/ ప్రాణం లేని మరబొమ్మలు మనుషులు' భావ ప్రకటనా స్వేచ్ఛను కోల్పోయిన సమాజంలో మనుషులు మరబొమ్మలుగా బతుకుతున్నారని కవి ఆవేదన. 'వంగి ఉన్నానని బానిసనుకుంటావు నీవు/ కొడవలి కూడా.. వంగే వుంటుందంటాను నేను' అంటూ ప్రబోధాత్మకంగా పల్లవిస్తాడు. స్త్రీ శ్రమసౌందర్యాన్ని ప్రస్తావిస్తు 'యవ్వనపు తొలి వాకిట్లో నిలుచున్నప్పుడు ఆ చేతుల కోమల త్వానికి వెన్న కూడా చిన్న బోయేది' మరి యిప్పుడు?' చెట్టుకే కాదు..ఆమె చేతులకూ కాయలు కాస్తాయి' అనడం బాగుంది. మంచి కవిత్వం చదవాలనుందా? 'ఆసు' కవితా సంపుటిని గుండెలకు హత్తుకోండి. **(ఆసు, రచన: డా॥వెల్దండి శ్రీధర్, వెల: రూ 150, ప్రతులకు: వెల్దండి సురేఖ, ప్లాంట్ నం.302, సాయిశ్రీ నివాసం అపార్ట్‌మెంట్, ఓల్డ్ అల్వాల్, హైదరాబాద్)**

**- రమణ వెలమకన్ని**

# పుస్తక సమీక్ష

కోర్కెలను తీర్చుకోవటానికి, పుణ్యాన్ని సంపాదించుకోవటానికి పాపాన్ని పోగొట్టుకొటానికి, స్వర్గప్రాప్తికి, దేశమంతటా తిరగాల్సిన పనిలేదని, కాశీలో సర్వదేవీదేవతలు కొలువై వున్నారని, 'శ్రీకాశీక్షేత్ర సందర్శనము'లో ఆధ్యాత్మిక జిజ్ఞాసి, అద్వైతజ్ఞానపిపాసి కాశావజ్జల వేంకటనరసింహమూర్తి ప్రబోధించారు. ప్రాచీన మహర్షులు ప్రవరించిన వైశ్విక చైతన్యప్రసార



## 'కాశావజ్ఝల' వారి కాశీక్షేత్ర అద్భుతగ్రంథం

ప్రణాళి కాబద్ధంగా, ఈ పుణ్యక్షేత్రంలో కొలువుతీరి, 21వ శతాబ్దపు ఆస్ట్రోఫి జిక్స్, కాస్మోలజీ, జాగ్రఫీ అధునాతన శాస్త్రాయ పరిశోధనా రహస్యాలను సందర్భోచితంగా, ఆస్తిక మహోదయులు, వేద, పురాణ శాస్త్ర పారంగతుడుయిన 'కాశావజ్జల' ఈ గ్రంథంలో వివరించారు. సంస్కృతాంధ్ర ఆంగ్లగ్రంథాలను పరిశోధించి, వ్యవహార, పరమార్థ వేదాంతసిద్ధాంత ప్రబోధాత్మకంగా రచింపబడిన ఈ పవిత్రగ్రంథంలో తొలి 80 పుటలలో కాశీక్షేత్ర దివ్యస్వరూప సంబంధిత కథనాలు, వృత్తాంతాలు, మహిమలు, వైశిష్ట్యాలు చోటు చేసుకొన్నాయి. 38 అధ్యాయాల అనుబంధపుటలలో యాత్రాదర్శ నీయ విధాన ప్రదేశ విశేషాలు, జలతీర్థ మహత్వం ఘాట్‌లు రేఖా పటాలతో సహా, చరిత్రకారుల నిర్దేశితంగా 2021 డిసెంబరులో భారతప్రధాని, క్షేత్ర ప్రాంగణ ఆక్రమణల నుండి విముక్తిపొందే పూర్వాలయ అంశాలను 'విశ్వనాథ కారిడార్' అభివృద్ధి బోధపరిచారు. **(శ్రీ కాశీక్షేత్ర సందర్శనము, రచన: కాశావజ్ఝల వేంకట నరసింహమూర్తి, వెల: రూ 300, ప్రతులకు: ఇ.నం.3-8-156, ఎల్.బి.నగర్, హైదరాబాద్)** **- యర్రమిల్లి**

'విరిసిన వసంతం' కథాసంపుటి రచయిత్రి చల్లా సరోజినీదేవి విశ్రాంతి ఉపాధ్యాయురాలు, సహృదయులు. సుమనస్కులు. తీరిక దొరికినపుడెల్లా కథో, కవిత్వమో రాస్తుంటారు. విమర్శలకు కాస్త జంకి కాగితాలకే పరిమితం చేస్తుంటారు.

## వెన్నెలలాంటి చల్లని కథలు



ఈమధ్యే వారు 'భావసుధలు' అన్న పేరున కొన్ని కథలను సంపుటీకరించారు. భావసుధలకు వచ్చిన స్పందన వల్ల కావొచ్చు, మరే కారణం వల్లనైనా కావొచ్చు. ఇప్పుడు 'విరిసిన వసంతం' పేరున ఈ రెండవ సంపుటిని మనముందుకు తెచ్చారు. 'నా మనసు పలికిన మాట'లో రచయిత్రి నిజాయితీగా చెప్పుకున్నట్లు... కొన్ని కథలు 1969 నాటి, ఆంధ్రా తెలంగాణా ఉద్యమం నాటివి. అయినా ఇవి 'కాలదోషం పట్టిన కథలుగా అనిపించవు. ఒంటరి ఆడపిల్ల మీద అత్యాచార ప్రయత్నం ఇవన్నీ నేటికీ కనబడుతోన్న 'సమాజరుగ్మతలే! ఇలా 'ఎవర్‌గ్రీన్' కథలు రాయటంతోనే కథకురాలికున్న 'ముందుచూపు' మనకు కనబడుతుంది. వివరించిన కథలు స్త్రీ, స్త్రీ కేంద్రంగా ఊహించి అల్లిన కథలు. కనుక అతిసహజంగా సాగుతాయి. బాగా పాటలు పాడే వికలాంగుడు నరసింహ, తల్లి కూతురు యెడ చూపే అవ్యాజమైన ప్రేమ, చేసిన మేలు మరిచిన సుగుణ, ఇంట్లో పెంపుడు కుక్కవల్ల, ఇరుగుపొరుగు వారు కలుగ చేసే బాధ ఇవన్నీ అతిసహజమైన శైలితో వెన్నెల్లో గోదారి ప్రయాణం అంత ఆహ్లాదంగా సాగుతాయి. **(విరిసిన వసంతం, కథలు, రచన: చల్లా సరోజినీదేవి, వెల: రూ 150, ప్రతులకు: ప్రముఖ పుస్తకశాలలు)** **- కూర చిదంబరం**

# గులాబి



**ఆమె** గులాబి పెదవుల మధురిమలు
నా హృదిన మధుర సుధారసాలు
ఆమె చల్లని చూపులు
నాకై పరిచిన వెన్నెల రాత్రులు
ఆమె కలువల కన్నులు
నా మనసుకి తాకిన
మరుమల్లెలు
ఆమె అవయవ సౌష్టవము నా
ఎదపై
నిత్య యవ్వన పాదస్పర్శ
నా తనువుపై జారిన
తేనెల రసధారలు
ఆమె పాలరాతి చెక్కిళ్లు
నా ముంగిట వాకిట్లో
ముత్యాల ముగ్గులు
ఆమె సుందర వొంపు సొంపులు
నాట్య భంగిమను తలపించేలా
నా హృదిలో
విరబూసుకున్న ఆ సుడులు తిరిగిన
కురుల ముడులు
నను అల్లుకున్న జాజితీగెలు
కలబోసి నఖశిఖ పర్యంతం
ఆ.. బ్రహ్మ
నాకై ఇల పంపిన
వనితానిత జనిత
నా కవితకి నాంది పలికిన సిరి
నారీ రసమాధురి
నా గుండెలపై అనునిత్యం
సవారి చేస్తున్న వెన్నెల రాసివి
నా మదిలో నిలిచిన
మరుమల్లివి

**- కొరుప్రోలు హారనాథ్**

---

# సృష్టి(వి) చిత్రం బోధపడుతుంది

చిరుతపై కనిపించే చుక్కలు
సప్తవర్ణాల పక్షుల ఈకలు
నీటిలో కదలాడే చేపల వర్ణాలు
పండ్లపై ఉండే పొరలను చూస్తే
సృష్టి కళాత్మక ధోరణి బోధపడుతుంది.
కొమ్మల్లో కోయిలమ్మల పాటలు
కొండకోనల్లో చిరుగాలుల సవ్వడులు
విత్తులు విత్తుల రంగుల
సెలయేర్ల సరిగమలను చూస్తే
భగవంతుని నైపుణ్యం బోధపడుతుంది.
ఉత్సుకత నిండిన మనసులు
పనులను భిన్నంగా చేసే ఆలోచనలు
ఆత్మశక్తి ఆవహించిన ప్రవర్తనలు
ఏటికి ఎదురీదే ధైర్యాలను చూస్తే
దేవుని దూరదృష్టి బోధపడుతుంది.





మంచుపొగలోని చల్లని రాగాలు
ఆవుదూడల ప్రేమైక పిలుపులు
పచ్చని చెట్ల యుగళ గీతాలు
కోవెల జేగంటల ప్రతిధ్వనులను చూస్తే
సృష్టిధర్మం బోధపడుతుంది.
వెదురువేణువులోని సరిగమలు
చిట్టిచీమల్లోని శ్రమ జీవన సౌందర్యాలు
సాలీడులోని అల్లిక చతురతలు
గిజిగాడులోని సాంకేతిక నైపుణ్యాలను
చూస్తే
సృష్టి(వి) చిత్రం బోధపడుతుంది.

**- పిల్లి హాజరత్తయ్య**

---

## ఈ వారం కవిత్వం

# విశ్రాంతి లేని నిజాలు

ఒక్కో రోజుకు
బాకీ పడతామో,
బాకీ తీరుతుందో తెలియదు.
పగలంతా ఊహాల్లో ఈత
రాత్రంతా మెలకువలో మునక
ఊడిగం చేసే ఆలోచనలో
విశ్రాంతి లేని నిజాలు
వెలుతురును కప్పుకుని
ఎండలో ఎగురుతూ
చీకటిని చుట్టుకుని
చలిలో ముడుక్కుని
తలను నేలలో పాతి
ఆకాశానికి కాళ్లను వేలాడతీసి
సంద్రంలా మారిన మెదడులోని
తెరలు తెరలుగా కలలు
నిద్రను ఢీకొని
బద్దలైన రోజులో
బద్ధకంగా బతికే ఉంటాయి.

**- శ్రీసాహితి**

# పండుగ వంటలు

**ఉగాది పండక్కి ఘుమఘుమలాడే పిండివంటలతో పాటు ఉగాది పచ్చడి చేసుకుంటారు. కానీ కొత్తగా పెళ్లైన వధువులకు, వంటపని అలవాటు లేనివారికి పిండివంటలు ఎలా చేయాలో తెలియదు. మరి కొన్ని వంటల్ని ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం.**



## పూర్ణం బూరెలు

**కావలసిన పదార్థాలు**

పచ్చి సెనగపప్పు-పావు కిలో; బెల్లం-200 గ్రా; యాలకుల పొడి-కొద్దిగా; నెయ్యి-4 స్పూన్లు.

పూతపిండికి కావలసిన పదార్థాలు

మినప్పప్పు-1 గ్లాసు; బియ్యప్పిండి-2 గ్లాసులు; ఉప్పు-చిటికెడు; నూనె-వేయించడానికి సరిపడినంత.

**తయారు చేసే విధానం**



మినప్పప్పు రెండు గంటల పాటు నానబెట్టుకుని మెత్తగా రుబ్బుకుని తడిపిన బియ్యప్పిండిలో వేసి తగినంత ఉప్పు కలిపి ఒక గంట నాననివ్వాలి. సెనగపప్పు కుక్కర్‌లో పప్పులా ఉడికించుకోవాలి. నీళ్లు లేకుండా వడగట్టాలి, అందులో బెల్లం తరిగి కలపాలి. పాన్‌లో కొద్దిగా నెయ్యి వేసి పై మిశ్రమం వేసి వేయించి ఉడికించాలి. నీళ్లు ఇంకిన తర్వాత మిశ్రమం ఓ గిన్నెలో వేసి చల్లార్చాలి. ఆ తర్వాత చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఈ ఉండలను రెడీగా ఉన్న పిండిలో ముంచి కాగిన నూనెలో వేసి దోరగా బంగారు రంగు వచ్చేవరకు వేయించి తీయాలి.

## బొబ్బట్లు

**కావలసిన పదార్థాలు**

మైదా-అర కిలో; పచ్చి సెనగపప్పు-పావు కిలో; బెల్లం-పావు కిలో; యాలకుల పొడి-కొద్దిగా; నెయ్యి-సరిపడినంత.

**తయారు చేసే విధానం**

మైదాపిండి జల్లించి పెట్టుకోవాలి. మైదా పిండిలో సరిపడినన్ని నీళ్లు పోసి ముద్దగా కలిపి పక్కన పెట్టుకోవాలి. ఒక పాత్రలో సెనగపప్పును వేసి మెత్తగా ఉడికించుకోవాలి. పప్పు ఉడికిన తర్వాత మిగిలిన నీటిని పూర్తిగా వంపేయాలి. ఈ పప్పులో బెల్లంతురుము, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. కలిపిన తర్వాత చిన్న చిన్న ఉండలుగా తీసుకొని రెడీ చేసి పెట్టుకున్న సెనగపప్పు ముద్దని మధ్యలో పెట్టి మళ్లీ ఉండలుగా చేసి కాస్త మందంగా చపాతిలా చేసి పెనంపై నెయ్యి వేసి కాల్చాలి.

## ఉగాది పచ్చడి

**కావలసిన పదార్థాలు**

కొత్త చింతపండు-కొద్దిగా; వేపపూత-తగినంత; తురిమిన కొత్త బెల్లం-సరిపడినంత; చిన్నగా తరిగిన మామిడికాయ ముక్కలు-కొద్దిగా; నీళ్లు-ఒక లీటరు.

**తయారు చేసే విధానం**

చింతపండులో గింజలు, నార లేకుండా శుభ్రం చేసి కొద్దిసేపు ఓ గిన్నెలో నానబెట్టాలి. ముందుగా వేపపూతను నీటిలో పోసి కడగాలి. మామిడి ముక్కలు, బెల్లం తురుము సిద్ధంగా ఉంచుకోవాలి. ఓ పాత్రలో చల్లటి నీటిని తీసుకోవాలి. అందులో సిద్ధంగా వుంచుకున్న చింతపండు రసం, బెల్లంతురుము, మామిడిముక్కలు వేయాలి. తరువాత కొద్దిగా వేపపూత వేయాలి. పడీ పడనట్లుగా చిటికెడు ఉప్పు వేసి బాగా కలిపితే బెల్లం తురుము కరిగి ఉగాది పచ్చడి తయారవుతుంది. తాగే సమయంలో కొద్దిమంది పుట్నాలపప్పు వేసుకుంటారు. మరికొంతమంది చెరకుముక్కలు, కొబ్బరి పొడి, పండుముక్కలు కలుపుకుంటారు.



కథ

# శ్రమలో దాగిన స్వర్ణం

అవంతి రాజ్య రాజు గుణశేఖరుడు కొందరి సైనికులు, కోశాధికారితో కలిసి సామంత రాజ్యాలలో రావలసిన కప్పం స్వయంగా వసూలు చేసుకుని వస్తూ అడవిబాటలో భోజనం కోసం ఆగారు. భోజనం తయారు కావడానికి సమయం పడుతుంది కనుక పరిసరాలను పరిశీలిస్తూ అడవి లోపలికి వెళ్లాడు రాజు. అక్కడ ఒక వ్యక్తి చెట్టుకింద దిగులుగా కూర్చుని కనిపించాడు. అతనికి చేరువగా వెళ్లిన రాజు "ఎవరయ్యా నువ్వు? దిగులుతో ఈ చెట్టుకింద కూర్చొని ఈ అరణ్యంలో ఏం చేస్తున్నావు?" అన్నాడు.



"ప్రభూ! నా పేరు శివయ్య. ఇక్కడికి కోసెడు దూరంలోని గ్రామ నివాసిని. గయ్యాళిభార్యతో వేగలేకపోతున్నాను. ఎలాగైనా ధనం సంపాదించాలని బయలుదేరాను" అన్నాడు.

అతనికి శ్రమలో స్వర్ణం దాగివుందని తెలియజేయదలచిన రాజు శివయ్యను తన వెంట తీసుకువెళ్లి, భోజనం పెట్టించి "శివయ్యా! అదిగో ఆ రథం నిండుగా ధనం ఉంది. నీకు ఎంత కావాలో అంత మూట కట్టుకుని తలపై పెట్టుకుని బయలుదేరు. అయితే దారిలో ఎక్కడా, దేనికీ ఆగకూడదు. తలపైన ఉన్న ధనంమూటను కిందకు దించకూడదు. అందులో నుండి కొంత తీసివేయకూడదు. నీ వెంట ఇద్దరు సైనికులు వస్తారు. ఈ నిబంధనలు సమ్మతమైతే ధనం మూటకట్టుకుని తలపై పెట్టుకుని బయలుదేరు" అన్నాడు రాజు.

అత్యాశపరుడైన శివయ్య మోయగలిగినంత ధనం మూట గట్టుకుని బయలుదేరాడు. కడుపునిండుగా భోజనం చేయడం వలన నడక వేగం తగ్గింది, దాహం వేయసాగింది. కానీ రాజు గారి నిబంధనలకు లోబడి తను ఎక్కడా ఆగకూడదు కనుక నెమ్మదిగా నడవసాగాడు. కొద్దిసేపటికి ఒక సెలయేరు కనిపించింది. దాహానికి ఆగలేక ప్రాణంకన్నా ధనం ఎక్కువ కాదని ధనంమూట నేలపై ఉంచి దాహం తీర్చుకోసాగాడు శివయ్య. అది చూసిన రాజభటులు శివయ్యను తీసుకువెళ్లి రాజగారి ముందు ఉంచారు.

"శివయ్యా! మనిషి ఆశాజీవి. ఆకలి, అవసరం మనిషిచేత ఏ పనైనా చేయిస్తుంది. ఆశ పుట్టిందంటే లభించినదానితో తృప్తి చెందదు. లభించిన వైభవం, సుఖశాంతులు చాలని అనుకోడు. ఇంకా ఏదో కావాలన్న తపన, ఆవేదన, నిరీక్షణతో సతమతమవుతుంటాడు. అతడి కోరికలు, ఆశలు తీరినా మనసులో కొత్తవి ఊరుతూనే ఉంటాయి. వంద ఏళ్ల బతకనని తెలిసి కూడా వెయ్యేళ్లకు సరిపడా మనిషి ఎందుకు సంపాదించాలి? మనిషికి ఆశ ఉండాలి కానీ అత్యాశ, దురాశ ఉండకూడదు. ఆశ జీవించడానికి వినియోగపడితే అత్యాశ పతనానికి నాంది అవుతుంది. నీవు శ్రమించి సుఖంగా బతికేందుకు నీకు కొంత వ్యవసాయ భూమిని ఏర్పాటు చేయిస్తాను. మీ కుటుంబ సభ్యులు ఆ భూమిలో వ్యవసాయం చేసుకుని హాయిగా జీవించండి" అన్నాడు రాజుగారు.

వినయంగా శిరస్సు వంచి నమస్కరిస్తూ "నా తప్పు తెలిసివచ్చింది ప్రభూ. శ్రమలో స్వర్ణం దాగుందని తమరి ద్వారా తెలుసుకున్నాను" అన్నాడు శివయ్య.

**- డా॥ బెల్లంకొండ నాగేశ్వరరావు**



వార్త ఆదివారం

## బాలగేయం

### రైలు ప్రయాణం

ఛుక్ ఛుక్ రైలు వచ్చింది
రంగుల ఇంజన్
ముందుంది.
పచ్చ జెండా గార్డు
ఊపారు.
ప్లాస్టిక్ బాటిల్ నీళ్లను,
జంక్‌ఫుడ్
అమ్మే వ్యాపారులను గార్డు
చూసాడు.
కోపంతో పచ్చ జెండా
చూపించగానే
ఛుక్ ఛుక్ మంటూ
రైలు ఆగకుండా వెళ్లింది.
ఇంకొక స్టేషన్ వచ్చింది.
కొబ్బరి బొండాలు, పండ్ల
వ్యాపారులను చూసాడు గార్డు
నవ్వుతూ ఎర్రటి జెండా
చూపించగానే
రైలు ఆగింది
ఆరోగ్యానికి మేలు
కలిగించే వాటిని
ప్రయాణికులు
సంతోషంతో కొన్నారు
పచ్చ జెండా చూపించగానే
ఒక్కసారిగా రైలు
కదిలింది.

**- ఓట్ర ప్రకాష్ రావు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- ఎస్.మందాకిని,** నిడదవోలు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. భోజనం చేసిన తరువాత చాలామంది అరటిపండు తింటుంటారు. ఈ అలవాటు మంచిదేనా?**

**జవాబు: మందాకిని!** వండిన పదార్థాలు జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. పండ్లలో విటమిన్‌లు, ఖనిజలవణాలు అధిక స్థాయిలో ఉండటంతో తిన్న కొద్దిసేపటికే జీర్ణమవుతాయి. వండిన పదార్థాలతో పాటు పండ్లను కూడా తింటే కడుపులో అవి వెంటనే జీర్ణం కాలేక, మిగిలిన(వండిన) పదార్థాలు జీర్ణం అయ్యే వరకు వేచి చూడాల్సి వస్తుంది. ఫలితంగా పండ్ల నుంచి తిన్న వెంటనే లభించాల్సిన పోషక పదార్థాలు పూర్తిగా శరీరానికి లభించకుండా వృధా అవుతాయి. భోజనం చేసిన తరువాత ఒకటిన్నర లేదా రెండు గంటలకు తిన్న ఆహారం రక్తం లోకి మారుతుంది. ఆ తర్వాతే మంచి నీరు పుష్కలంగా తాగాలి. పండ్లూ తినవచ్చు.

**- ఆశిష్,** కాకినాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. అగ్నిపర్వతాల వల్ల ఎలాంటి లాభ, నష్టాలున్నాయి?**

**జవాబు: ఆశిష్!** లాభనష్టాలనేవి ప్రకృతికి సహజ లక్షణం. భూమి ఏర్పడిన తొలి దశలో అగ్నిపర్వతాల వల్లనే భూమి మీద సముద్రాలు, పర్వతాలు, పీఠభూములు, చదునైన ప్రదేశాలు ఏర్పడటం వల్ల అద్భుతమైన నైసర్గిక స్వరూపం రూపుదిద్దుకున్నది. లావా ప్రవహించిన నేల ఏ రైతూ ఊహించలేని విధంగా అత్యంత సారవంతమైనదిగా మారుతుంది. అగ్నిపర్వతాలు మొక్కలకు అవసరమైన కార్బన్ డయాక్సైడ్‌ను అందిస్తాయి. అగ్నిపర్వతాల నుంచి వెలుపలికి దూసుకువచ్చిన శకలాలను భవన నిర్మాణాలలో, రసాయన పరిశ్రమలలోను విరివిగా ఉపయోగిస్తారు.





# మంచు తుపానులో ఆనంద కేరింతలు

సముద్ర మట్టానికి సుమారు పదకొండు వేల అడుగుల ఎత్తులో ఉన్న ఓ చిన్న కొండ పట్టణం ద్రాస్. ఈ గ్రామం మంచుకొండలు, లోయలతో పారే నదీ ప్రవాహంతో చూడముచ్చటగా ఉంటుంది. కార్గిల్‌కీ జోజిలాపాస్‌కీ మధ్య ఉన్న ఎన్‌హెచ్ వన్ రహదారిలో ఉంటుంది. 1999 నాటి కార్గిల్ యుద్ధం కారణంగా, లద్దాఖ్‌కి ప్రవేశ ద్వారం కావడంతో ట్రెక్కింగ్ ప్రియుల్నీ ఇది ఆకర్షిస్తోంది. పైగా ఐస్ హాకీ, స్కేటింగ్ లాంటి క్రీడల్ని ప్రోత్సహించడంతో అక్కడికి వెళ్లేవాళ్ల సంఖ్య పెరుగుతోంది.



ద్రాస్ చిన్న ఊరు. చెక్కలతో, ఇటుకలతో, మట్టితోనూ కట్టిన ఇళ్లు, దుకాణాలు రోడ్డుకి రెండు వైపుల ఉంటాయి. ఈ ఊరి అసలు పేరు హెమ్-బాబ్స్. అంటే మంచునేల అని అర్థం. చలికాలంలో సాధారణ ఉష్ణోగ్రత మైనస్ 20 డిగ్రీల సెల్సియస్. కానీ చాలా సార్లు ఇది మైనస్ 30 నుంచి 45 డిగ్రీలకు పడిపోతుంటుంది. 1995లో రష్యాలోని వ్యోమ్యకాన్‌లో మాదిరిగా -60 సెల్సియస్ డిగ్రీలు నమోదు కావడం విశేషం. అక్టోబర్ నుంచి మే మధ్య వరకూ చలి కాలమే. నవంబరు-డిసెంబరు నెలల్లో చలితీవ్రత ఎక్కువ. అక్కడ నివసించే ప్రజలు ఆ చలికి, మంచుతుపానులకీ ఏమాత్రం భయపడకుండా హాయిగా గడుపుతారు.

**ఎవరుంటారు?**

ఇండో-ఆర్యన్లయిన షినా, టిబెటన్ ప్రాంతానికి చెందిన బాల్టి తెగల ప్రజలు ద్రాస్‌లో నివసిస్తున్నారు. వీళ్లు దృఢంగా ఉంటారు. ఎక్కువ శాతం ముస్లింలే. కొద్దిమంది బౌద్ధులు. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతానికి వలస వచ్చిన షినా తెగ నేటికీ తమ సంస్కృతిని కాపాడుకుంటూ జీవిస్తున్నారు. వీళ్లు పశువుల్నీ, గుర్రాల్నీ పెంచుతారు. బార్లీ, బక్‌వీట్ ఇక్కడి ప్రధాన పంటలు. బార్లీపిండితోనే రొట్టెలు చేసుకుంటారు. జావ చేసుకుని మటన్ సూపర్‌తో కలిపి తాగుతారు. ఇది చాలావరకు చలిని తగ్గిస్తుందట. బీఫ్, బంగాళాదుంపల్నీ కూడా తింటుంటారు. మందపాటి ఉన్నిదుస్తులు ధరించి, నేలమాళిగలో ఉన్న వంటింట్లో లేదా హాల్‌లో కాలక్షేపం చేస్తుంటారు. ప్రతి ఇంటిలోనూ ఫైర్ ప్లేస్ తప్పనిసరి. మైనస్ 45 డిగ్రీల సెల్సియస్ కన్నా ఉష్ణోగ్రత తక్కువకి పడిపోయినప్పుడు జీవనం కష్టమతువుంది. జంతువులు చలిధాటికి తట్టుకోలేక చనిపోతుంటాయి. అందుకే కాస్త డబ్బు, పరపతీ ఉన్నవాళ్లు చలికాలం వస్తుందనగానే జమ్మూ, చండీగఢ్, శ్రీనగర్‌లకు వెళ్తుంటారు. కానీ ఎక్కువ శాతం అక్కడే ఉంటారు. ప్రమాదకరమైన రహదారిగా పేరొందిన జోజిపాస్ గుండా ప్రయాణించడం ద్రాస్ ప్రజలకే సాధ్యమవుతుంది. సూదిమొన అంచుల్లో ప్రయాణిస్తున్నట్లుగా ఉంటుందా ఆ దారి. వణికించే చలి, మంచుతుపానులు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అందుకే ఆ మార్గంలో ప్రయాణించాలంటే వేసవిలోనూ వీళ్ల సహాయం అవసరం.

శీతాకాలంలో ద్రాస్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలన్నీ మంచు ముసుగేసుకున్నట్లే ఉంటాయి. సరస్సులు గడ్డకట్టుకుపోయి నేలంతా తెల్లని ఎడారిని తలపిస్తుంది. దారి కనిపించదు. ఉదయాన్నే మంచును పక్కకు తొలగించుకుంటూ జీవనం సాగించాలి. అందుకే చలితీవ్రత ఎక్కువగా ఉండే నవంబరు నెలాఖరు నుంచి జనవరి వరకూ శ్రీనగర్-లేహ్ దారిని

మూసేస్తారు. పరిస్థితిని బట్టి ఏప్రిల్ వరకూ పొడిగిస్తుంటారు. స్కూళ్లకూ సెలవులు ఇస్తారు కనుక చిన్నా పెద్దా అందరూ ఇళ్లకే పరిమితమవుతారు. ఇళ్లల్లోని కమోడ్‌లు సైతం పనిచేయవు. దాంతో బిగ్రబిగుసుకుపోయే మంచులోనే కాలకృత్యాలు కానిస్తారు. కొన్ని చోట్ల మున్సిపల్ కుళాయిలను తిప్పే వుంచడంతో పగలూ రాత్రీవాటిల్లోంచి నీళ్లు వస్తూనే ఉంటాయి. ఒకసారిగానీ వాటిని బంద్ చేస్తే అవి బిగుసుకుపోయి వేసవి వచ్చేవరకూ తిప్పడం సాధ్యం కాదు. ఇక నదులూ, పైపులైన్లలోని నీళ్లూ గడ్డకట్టుకుపోతాయి. ఆ సమయంలో స్థానికులకు వేడినీటి కొలనుల్లోని నీరే శరణ్యం. అందుకే ఆ మంచులోనే నడుచుకుంటూ వెళ్లి ఆ నీటిని తెచ్చుకుంటారు. అలా వెళ్లలేనివాళ్లు గడ్డపారతో నదికి రంధ్రం చేసి బావిలో మాదిరిగా నీళ్లు తోడుకుంటారు. ఈమధ్య పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తోంది. కానీ ఒక్కోసారి మంచు మరీ ఎక్కువగా ఉన్నప్పుడు ఇంజిన్లు మొరాయించడంతో గాడిదలు, గుర్రాల మీదే పంపిణీ చేస్తుంటారు. లేని పక్షంలో ఆ మంచు పెళ్లల్నే కరిగించుకుని వాడుకుంటారు. అందుకే గ్యాస్‌స్టవ్‌లు ఉన్నా వంటింట్లో కట్టెల పొయ్యిలు రాత్రీ, పగలూ మండుతూనే ఉంటాయి.

**మాంసాహారం తింటారు..**

బార్లీతో పాటు మాంసాహారాన్ని ఎక్కువగా తింటారు ఇక్కడి ప్రజలు. అందుకే చలికాలం ప్రారంభంలోనే జడలబర్రె, మేక, గొర్రె లాంటి జంతువుల్ని చంపి, దాన్ని చర్మంతోనే ఇంట్లోని స్టోర్ రూమ్‌లో వేలాడదీసుకుంటారు. దాన్నుంచి సరిపడా మాంసాన్ని కావాల్సినప్పుడు కోసుకుంటారు. ఈ పద్ధతిలో కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి రెండు వందల కిలోల వరకూ నిల్వ చేస్తారట. అయితే గొర్రె, మేక కన్నా జడలబర్రె మాంసమే



అక్కడ చౌకగా లభిస్తుంది. మాంసంతో పాటు దుంపకూరలు, పప్పులు, ధాన్యాలు కూడా ఇంట్లో నిల్వ చేసుకుంటారు. వీటిని నిల్వ చేసుకునేందుకు ఫ్రిజ్ అవసరం లేదు. ఆహారం చల్లబడకుండా ఉంటుందని కుటుంబీకులంతా పొయ్యిదగ్గరే కూర్చుని తింటారు. ఇళ్ల మీద ఎండుగడ్డిని కప్పడం వల్ల కొంత చలి తగ్గుతుంది.



చలికాలంలో వృద్ధులు బయటకు అడుగుపెట్టరు. కానీ ఇక్కడ పోలో ఛాంపియన్ షిప్‌ను నిర్వహిస్తుండటంతో కొందరు యువకులు స్కీయింగ్ చేస్తూ పోలో ఆడుతూ కనిపిస్తుంటారు. ద్రాస్ యువకులు చదువుకుంటారుగానీ తమకున్న కొద్దిపాటి పొలాన్ని సాగు చేసుకుంటూ జీవించడానికే ఇష్టపడతారు. ఇటీవల టూరిస్టుల సంఖ్య పెరగడంతో హోమ్ స్టేలతోనూ కొంత ఆదాయం వస్తోందట. ద్రాస్ మహిళలు కష్టజీవులు. చలికాలంలో స్వెటర్లు అల్లుకుంటూ గడిపినా మిగిలిన కాలంలో వ్యవసాయ పనులకు వెళ్తారు. వేసవి రాగానే తెల్లని మంచు అదృశ్యమై లోయంతా రంగు రంగుల పూలతో విచ్చుకుని దేవలోకాన్నే మరిపిస్తుంది. అందుకే ఈ చలి మమ్మల్ని ఏమాత్రం బాధించదు అంటారు స్థానికులు. మే నుంచి నవంబరు వరకూ గపలంతా ఎండ ఉన్నప్పటికీ సాయంత్రం కాగానే చల్లని గాలులు వణికిస్తాయి. కానీ ఆ కాలంలో పచ్చని పంటలతోనూ విలో, అప్రికాట్, ఆపిల్ తోటలతో లోయ కళకళలాడుతుంటుంది. అక్కడ ఆడే పోలో చూడ్డానికి చాలామంది వస్తుంటారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులతో తమ అనుభవాల్నీ, స్థానిక విశేషాల్నీ కథలు, కథలుగా చెబుతూ ఎంతో స్నేహంగా మెలగుతారు ద్రాస్ ప్రజలు. ద్రాస్ శివార్లలోని భీమ్‌పేట్‌లో ఉన్న ఒక పెద్ద రాయిని భీముడుగా భావించడంతో పాటు, దానికి రోగాల్ని నివారించే శక్తి ఉందని నమ్ముతారు. ఒక్క నేరం కూడా నమోదుకాని డాంగ్‌చిక్ అనే మోడల్ గ్రామం ద్రాస్‌కు పది కి.మీ. దూరంలో ఉంది. ఇంకా మన్‌మన్ శిఖరం, ఇండో-పాక్ మధ్య ఉన్న నియంత్రణ రేఖ, ఐదు కి.మీ. దూరంలోని గోమ్‌చన్ లోయలోని గ్లేసియర్, అమరవీరుల స్మారకార్థం నిర్మించిన ద్రాస్ లేదా కార్గిల్ వార్ మెమోరియల్, ద్రౌపదీ కుండ్, గోషన్‌లోయ.. ఇలా చూడదగ్గ ప్రదేశాలు ఎన్నో ఉన్నాయిక్కడ. పాల తెలుపు రంగు నీళ్లకు పేరొందిన లేసర్‌లా, వన్య ప్రాణులకు పేరొందిన చోర్‌కియాట్ అరణ్యం కూడా ఇక్కడే ఉన్నాయి. అందుకే శీతాకాలంలో రక్తాన్ని గడ్డ కట్టించే మంచు కురిసినా, వేసవిలో పంటలు పండించుకుంటూ తమదైన జీవనాన్ని కొనసాగించే ఇండో-ఆర్యన్ ప్రజల కారణంగా ద్రాస్ పట్టణం పర్యాటకుల్ని ఎంతగానో ఆకట్టుకుంటోంది. ❑



కథ

# మానెమ్మ

దార్ల శ్రీనివాసరావు

ఆ రోజు ఊళ్లో రెడ్డి గారి బావి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఒకరి మీద ఒకరు చతుర్లు విసురుకుంటూ, పొడుపు కథలు వేసుకుంటూ సరదాగా పనులు చేస్తున్నారు. గట్టుపైనున్న రెడ్డిగారి మనిషి మాత్రం, "కబుర్లు తగ్గించి పని చెయ్యండెహె" అరుస్తున్నాడు లంకచుట్ట కాలుస్తూ.

ఇవేమీ తనకి సంబంధం లేదన్నట్లు రంగయ్య మాత్రం చేసే పని మీద ధ్యాస లేక దారివంకే చూస్తున్నాడు.

"ఏమైందిరా రంగయ్యా? ఎందుకు అదోలా ఉన్నావ్?" పలకరించాడు పక్కనే ఉన్న సోము."ఏం లేదురా, రోజూ సమయానికి భోజనం తెచ్చే తను ఇంతవరకు రాలేదు. వద్దు అంటే వినదు కదా, అదే ఆలోచిస్తున్నా.." అన్నాడు.

"తనకి ఇంకెవరున్నారు నువ్వు తప్ప. అందుకే తన ధ్యాస అంతా నీ మీదే ఉంటుంది" చెప్పాడు సోము.

"అదీ నిజమేరా. కానీ ఈ పరిస్థితుల్లో కూడా అంతలా కష్టపడొద్దే అంటే ససేమిరా అంటుంది" నిట్టూర్చి పనిలో నిమగ్నమయ్యాడు రంగయ్య.

"నిండు గర్భిణివి, నీకెందుకే ఆ పనులు కాసంత నిదానంగా ఉండేవే" చెప్పింది మల్లత్త మానెమ్మతో.

"రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు కదత్త మనవి. నా మొగుడు రోజంతా కష్టపడితే వచ్చే డబ్బు నా ఆసుపత్రి కర్సులకే సరిపోతోంది. ఒక్కడే గొడ్డుసాకిరీ సేసి తెచ్చిన డబ్బంతా నాకే పెడతా అంటే నాకెక్కడ మనసొప్పుతది సెప్పు. ఆయన కోసం ఏనాడూ ఆలోచించుకోడు. నీకు తెలుసుగా అత్త, ఎంత జాగ్రత్తగా ఉన్నా పోయినసారి బిడ్డ పుట్టకముందే కడుపులోనే చనిపోయింది. ఆ రోజు ఆయన ఎంతలా కుమిలిపోయాడో నీకు తెలియదత్తా" అంటూ కొంగుతో కన్నీళ్లు తుడుచుకుంది మానెమ్మ.

"తనొక్కడే అంతలా కష్టపడటం నేను చూడలేకపోతున్నా. అందుకే మొండిగా తనకి ఆసరాగా వీలైనంత పనులు చేస్తున్నా" అంటూ లేవబోయింది మానెమ్మ.

చిన్న చిన్న నొప్పులు మొదలయ్యాయి మానెమ్మకి.. పక్కనే ఉన్న మల్లత్త మనవడితో "ఒరే నాయనా, పోయి రంగయ్యకి తొందరగా రమ్మని సెప్పు" అంటూ పంపింది.

ఆదరా బాదరా వస్తున్న పిల్లగాడిని గమనించిన రంగయ్య అతనికి ఎదురెళ్లి విషయం తెలుసుకున్నాడు. తను ఊహించిందే జరిగింది. మానెమ్మకి పురిటినొప్పులు వస్తున్నాయని అక్కడనుండి బయలుదేరాడు కంగారుగా.

మట్టిరోడ్డు, కాళ్లకి చెప్పులు లేకపోవడం వలన దారిలో కాలి బొటనవేలికి రాయి తగిలి రక్తం కారుతోంది. అవేమీ తనకి పట్టడం లేదు. అలా పోతూ పోతూ దారిలో రెడ్డిగారి ఇంటిదగ్గర విషయం చెప్పి, కాస్తంత డబ్బు అప్పుగా తీసుకున్నాడు.



ఇంటికి చేరుకోగానే పురుడు పోయడానికి వచ్చిన పెద్దావిడ "బిడ్డ అడ్డం తిరిగింది నాయనా, ఆసుపత్రికి తీసుకెళ్లాలి. తొందరగా ఆ ఏర్పాట్లు చేయి" అని చెప్తూ లోపలికి వెళ్లిపోయింది కంగారుగా.

రంగయ్యకి ఏం చేయాలో అరావడం లేదు. వాళ్ల ఊరికి ఒకటే బస్. ఆసుపత్రికి పోవాలంటే వాళ్ల ఊరి మీదుగా పట్టణానికి ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి వెళ్తుంది. దానికితోడు రోడ్లు కూడా సరిగ్గా లేకపోయే.

త్వర త్వరగా రెడ్డిగారి ఇంటికెళ్లి ఎడ్లబండి సిద్ధం చేసి తీసుకువచ్చాడు.

"త్వరగా పోనివ్వు నాయనా బండిని.." కంగారుగా చెప్పింది పెద్దావిడ.

"ఆ, ఆ.. కొంచెంసేపు, అమ్మా వచ్చేశాం. కొద్దిగా ఓర్చుకోవే మణీ" అంటూ ఎద్దులని ఉరికిస్తున్నాడు రంగయ్య.

"ఏమయ్యా, నా వల్ల కావడంలేదయ్యా నొప్పులు.." నొప్పిని పంటి బిగువున భరిస్తూ చెప్పింది మానెమ్మ.

"వచ్చేసినామె మణీ, ఇదుగో.. ఇంకొంచెంసేపు ఓర్చుకో" అన్నాడు రంగయ్య ఏమీ చేయలేని స్థితిలో ఆవేదనగా. కొంచెం దూరం వెళ్లగానే దారిలోనే ప్రసవం అయ్యి నీరసించడంతో స్పృహ కోల్పోయింది మానెమ్మ. స్పృహ వచ్చేసరికి తను దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో ఉండటం గమనించింది.

తన పక్కని తడుముతూ అటూ ఇటూ చూస్తుండగా "ఈసారి కూడా దేవుడు మనకి అన్యాయమే చేశాడే మణీ" అంటూ మానెమ్మని గుండెలకి హత్తుకొని భోరున ఏడ్వసాగాడు రంగయ్య.

అతనితో పాటు మానెమ్మ కూడా ఏడ్వసాగింది.

రెండు రోజులు ఆసుపత్రిలో ఉంచిన తర్వాత మానెమ్మను ఇంటికి పంపారు ఆసుపత్రివాళ్లు.



బిడ్డ పోయిన బాధలో ఉన్న ఆ దంపతులు నడుచుకుంటూనే ఊరికి తిరుగు ప్రయాణమయ్యారు. దురదృష్టం వాళ్లను మరో రూపంలో వెంటాడుతుందని ఆ క్షణంలో గ్రహించలేకపోయారు.

... ... ...

మనోహర్ బిజినెస్ పనిమీద క్లయింట్‌ని కలవడానికి మెట్రోలో బయలుదేరాడు.

చూస్తుండగానే కంపార్టుమెంటు ఫుల్ అయ్యింది. అమీర్‌పేట చేరుకోవడానికి అరగంట సమయం పట్టింది. అప్పటివరకు ల్యాప్టాప్‌లో ఏదో పని చేస్తూ కూర్చున్న మనోహర్ ట్రైన్ డోర్ మూసుకుంటున్న సమయానికి పని నుండి తేరుకుని ఒక్క ఉదుటులో బయటపడ్డాడు.

"అబ్బబ్బ... ఎంత మంది జనం.." అనుకుంటూ విసుగ్గా స్టేషన్ నుండి బయటికి వస్తుంటే అతని చూపు ఓ మూలగా కూర్చున్న స్త్రీ మీదకి మళ్లింది.

తెల్లటి చింపిరి జుట్టు, పాలిపోయి మొహం.. చాలా రోజుల నుండి సరిగ్గా భోజనం కూడా చేసినట్లు లేదు. శరీరం నీరసంగా వణుకుతూ ఉంది. చీరె కూడ అక్కడక్కడా చినిగి ఉంది. ఆమెను చూడగానే ఎక్కడో చూసినట్లనిపిస్తోంది. కానీ గుర్తుకు రావడం లేదు. కొద్దిసేపు అక్కడే ఉండి తననే చూడసాగాడు. ఇంతలో క్లయింట్ నుండి కాల్ రావడంతో అక్కడ నుంచి బయలుదేరాడు క్లయింట్ పంపిన కారులో.

**మరుసటి రోజు సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లగా మారి, వర్షం కురవడం ప్రారంభమైంది. ఉరుములు మెరుపులతో జోరు వర్షం. ఆ కొద్దిసేపటి వర్షానికే రోడ్లన్నీ జలమయం అయ్యాయి.**

"హలో మనోహర్, ఎలా ఉన్నావోయ్!" పలకరించాడు వీరప్రతాప్.

"హలో సర్! ఐ యామ్ వెరీ ఫైన్.." నవ్వుతూ బదులిచ్చాడు మనోహర్.

"మీ నాన్నగారికి అలా జరిగుండకూడదోయ్. అప్పుడప్పుడే అతను రాజకీయంగా ఎదుగుతున్నాడు" నిట్టూర్చాడు వీరప్రతాప్.

"మేం చాలా ట్రై చేశాం సర్. కానీ లాభం లేకపోయింది" అన్నాడు మనోహర్.

"ఎనీహౌ, నువ్వున్నావుగా. మీ నాన్నగారి పెంపకం మీద మాకు పూర్తి నమ్మకం ఉంది" నవ్వాడు వీరప్రతాప్.

"థాంక్యూ సర్. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను" బదులిచ్చాడు మనోహర్.

"నీ ప్రాజెక్టు ఫైల్ చూశాను. చాలా ఫెంటాస్టిక్‌గా ఉంది" మెచ్చుకున్నాడు వీరప్రతాప్.

"థాంక్ యు సర్, ఇది నా కల. దానికి మీరు సహాయం చేయడం నిజంగా నా అదృష్టం" పొంగిపోయాడు మనోహర్.

"మీ నాన్నగారు బిజినెస్ పరంగానే కాదు, పర్సనల్‌గా కూడా నాకు మంచి ఫ్రెండ్. పైగా ఈ ప్రాజెక్టు వల్ల నాకు కూడా కొంత బిజినెస్ పరంగా, రాజకీయ పరంగా ఉపయోగం ఉంది" చిన్నగా చెప్పి నవ్వాడు వీరప్రతాప్.

"ఓకే సర్, మీరు వీలైనంత త్వరగా పర్మిషన్ ఇప్పిస్తే నేను టీంని రెడీ చేసుకుంటాను" అన్నాడు మనోహర్.

"తప్పకుండా మనోహర్.. అండ్ డోంట్ కాల్ మీ సర్. యు కెన్ కాల్ మీ అంకుల్" అంటూ తన కూతురి వైపు చూశాడు.

"థాంక్ యు అంకుల్" అంటూ అక్కడ నుండి బయలుదేరాడు మనోహర్ సంతోషంగా.

ఇంటికి చేరుకున్న కొడుకుని చూసిన వసుధ "ఏమైంది మనో? ఆ కారు ఎవరిది? మన కారు ఏమైంది?" అని ఆరా తీసింది.

"మన కారు కొంచెం ట్రబుల్ ఇవ్వడంతో మెట్రోలో వెళ్లానమ్మా. క్లయింట్ ఆఫీసు అక్కడే కదా అని వచ్చేప్పుడు ఆయనే నన్ను డ్రాప్ చేయడానికి కారు ఇచ్చి పంపారు. చాలా మంచివారు అమ్మా ఆయన" సంతోషం వ్యక్తం చేశాడు.

"సరేలే.. ఫ్రెష్ అయ్యి రా, భోజనం వడ్డిస్తాను" అంటూ కిచెన్‌లోకి వెళ్లింది వసుధ.

ఫ్రెష్ అయ్యి వచ్చిన మనోహర్ భోజనం చేస్తూ ఆరోజు జరిగిన విషయాలను తల్లితో పంచుకుంటున్నాడు.

"అమ్మా! ఈరోజు మెట్రో దగ్గర ఒకామెను చూశాను. తను అచ్చం మానెమ్మలాగానే ఉంది".

"చాల్లేరా, తన గురించి ఇప్పుడెందుకు? నువ్వు భోంచేసి కాస్త రెస్ట్ తీసుకో. మనం మళ్లా మాట్లాడదాం" అంటూ వసుధ ఆ టాపిక్‌ని అక్కడే ఆపేసింది.

తల్లిని ఇబ్బంది పెట్టడం ఇష్టంలేని మనోహర్, ఇక చేసేదేమీ లేక తన రూమ్‌లోకి వెళ్లిపోయాడు.

మరుసటి రోజు సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లగా మారి, వర్షం కురవడం ప్రారంభమయ్యింది. ఉరుములు మెరుపులతో జోరు వర్షం. ఆ కొద్దిసేపటి వర్షానికే రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వర్షం కాస్త తగ్గుముఖం పట్టాక, అటుగా వెళ్తున్న మనోహర్‌కి మానెమ్మ గుర్తుకొచ్చింది.

తన కారు అమీర్‌పేట మెట్రో వైపు తిప్పాడు. కానీ ఆమె అక్కడ లేదు. చాలాసేపు వెతికినా ప్రయోజనం లేకపోయింది. ఇంటికి బయలుదేరుతుండగా ఓ షెట్టర్ దగ్గర కొంత మంది ఉన్నారు.

అందరూ బాగా తడిసిపోయారు. వాళ్లల్లో అతను వెతుకున్న మానెమ్మ కూడా ఉంది. షట్టర్ ఓనర్ అందరినీ అక్కడనుండి పొమ్మని తిడుతున్నాడు. తన కోసం ఎంతో చేసిన మానెమ్మను ఆ పరిస్థితులలో చూసి చలించిపోయాడు.

కొన్ని రోజుల తర్వాత వీరప్రతాప్ నుంచి కాల్ వచ్చింది. వెంటనే వెళ్లి కలిశాడు మనోహర్.

"మే ఐ కమిన్ సార్!" అడిగాడు.

"ఆ...! కమ్ ఇన్‌సైడ్ మై బోయ్. అదేమిటోయ్.. స్వీట్స్ బాక్స్‌తో వస్తావ్ అనుకుంటే నువ్వేమో ఖాళీ చేతులతో వచ్చావ్" అడిగాడతను.

"అంటే సార్! మన ప్రాజెక్టు..." ఆనందంగా అడిగాడు మనోహర్, విషయం అర్థం అయ్యినట్లు.

"యస్ మై డియర్, నువ్వు అనుకున్న పని మొదలుపెట్టే టైం వచ్చింది. ఒక మంచిరోజు చూసి మొదలుపెడదాం" అంటూ మనోహర్‌ని హత్తుకున్నాడు ఆత్మీయంగా. "థాంక్యూ వెరీ మచ్ సార్. ఇదంతా మీ చలవే. మీరే లేకుంటే ఈ ప్రాజెక్టు ఏమైపోయేదో" అన్నాడు కన్నీళ్లు తుడుచుకుంటూ.

"మంచివాళ్ల కలలకి న్యాయం చేసినప్పుడే కదా నిజమైన ఆనందం. మీ అమ్మగారిని ఒకసారి కలిసే ఏర్పాటు చేయి. కాస్త మాట్లాడే పని ఉంది" చెప్పాడు వీరప్రతాప్.

"సరే అంకుల్.." అంటూ బయలుదేరిన మనోహర్, వీరప్రతాప్ అమ్మాయి పూజితని కలిసి ఏదో చెప్పి అక్కడ నుండి బయలుదేరాడు ఉత్సాహంగా.

... ... ...

వీరప్రతాప్, ప్రభుత్వ సహకారంతో ఓ మోడల్ విలేజ్‌ని అనుకున్న సమయానికంటే ముందుగానే తక్కువ బడ్జెట్, ఎక్కువ నాణ్యతతో నిర్మించాడు మనోహర్.

మోడల్ విలేజ్ ప్రారంభోత్సవానికి పార్టీ పెద్దలని ఆహ్వానించాడు వీరప్రతాప్.

"హలో, పూజితా! ఇక్కడంతా రెడీ. మీరు రావడానికి ఇంకా ఎంతసేపు పడుతుంది?" అడిగాడు మనోహర్.

"మేం దాదాపుగా చేరుకున్నాం. ఇంకొద్దిసేపట్లో అక్కడికి వచ్చేస్తాం" అంటూ కాల్ కట్ చేసింది పూజిత పక్కనే ఉన్న మానెమ్మ వైపు చూస్తూ.

మానెమ్మ మాత్రం కొత్తగా, ఆశ్చర్యంగా చూస్తోంది. అది తను పెరిగిన ఊరు, ఇబ్బంది పడ్డ ఊరు, తన భర్తని పోగొట్టుకున్న ఊరు, గుర్తు పట్టనంతగా మారిపోయింది. ఆ ఊరికి రోడ్లు పడ్డాయి. కరెంట్ లైట్లు వేశారు. నీటి పంపులు వేశారు. పూరిగుడిసెలతో ఎప్పుడూ కళావిహీనంగా ఉండే ఊరు, ఇప్పుడు సకల సౌకర్యాలతో కాంతులీనుతోంది.

అతిథులు అందరూ వచ్చాక సభని ప్రారంభించి, మనోహర్‌ని పెద్దలకి పరిచయం చేశాడు వీరప్రతాప్.

ఒక్కొక్కరుగా వేదిక మీద అక్కడ జరిగిన అభివృద్ధిని గురించి, వాళ్ల పార్టీని, వీరప్రతాప్‌ని, ఇదంతా చేసిన మనోహర్‌ని ఆకాశానికెత్తేశారు.

పెద్దలందరూ మాట్లాడిన తర్వాత, అందరికీ కృతజ్ఞతలు తెలియజేసిన మనోహర్, అప్పుడే అక్కడికి చేరుకున్న మానెమ్మని ఎవరూ ఊహించని విధంగా వేదిక మీదకి ఆహ్వానించాడు.

ఆమె కంగారుపడటం చూసి, వేదిక మీద నుంచి దిగి, మానెమ్మని వేదిక మీదకి తీసుకెళ్లాడు మనోహర్.

"ఈమె పేరు మానెమ్మ. ఈ ఊరిలో ఉన్న చాలా మందికి ఈమె గురించి తెలుసు. మా నాన్నగారు రంగనాథ్‌కి ఈమెతో ఉన్న సంబంధం గురించి లోకానికి తెలీక అభాండాలు వేసింది. అసలేం జరిగిందో నేను చెప్తాను.

పని మీద ఊరెళ్లి తిరిగొస్తున్న నాన్నగారికి ఒక్కసారిగా గుండెనొప్పి వచ్చింది. నడుపుతున్న బండిని అదుపు చేయలేకపోయాడు.

అది గమనించిన రంగయ్య, మానెమ్మని కాపాడబోయాడు. బండి ఢీ కొట్టింది. రంగయ్య తలకి పెద్ద దెబ్బ తగిలింది. మానెమ్మ కాస్తంత దూరంలో పడింది.

కాసేపటికి అక్కడికి చేరుకున్న జనాలు వాళ్లని ఆసుపత్రిలో చేర్పించి మాకు కబురు పంపారు. నాన్నగారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, హార్ట్ ఎటాక్ వల్ల గుండె చాలా వీక్ అయ్యిందని, ఆపరేషన్ చేయడమా లేక గుండె మార్పిడా అని సాధ్యాసాధ్యాలు ఆలోచిస్తున్నామని చెప్పారు" డాక్టర్లు.

"రంగయ్య పరిస్థితి ఎలా ఉందని?" మామయ్య ఆరా తీశాడు.

ఆయనకి బ్రెయిన్ డెడ్ అయ్యిందని తెలిసి ఎంతగానో చింతించాం. వాళ్లు ఒప్పుకుంటే ఆయన గుండెని నాన్నగారికి పెట్టొచ్చని, దానికి అతని భార్య మానెమ్మ అంగీకారం తప్పనిసరని డాక్టర్ చెప్పాడు.



మానెమ్మకి అర్థమయ్యేలా పరిస్థితిని మామయ్య వివరించాడు. ఆమె అంగీకారం తీసుకున్నాడు. నాన్నగారికి గుండెమార్పిడి జరిగింది. మామయ్య ఇచ్చిన మాట ప్రకారం మానెమ్మను మా ఇంటికి తీసుకొచ్చాం. ఆమెకు ఏ లోటూ రాకుండా చూసుకున్నాం.

మానెమ్మ మాత్రం తల్లడిల్లిన తల్లిప్రేమతో పిల్లాడిలా ఉన్న నన్ను వదిలేది కాదు. నా బాధ్యతలన్నీ తనే చూసుకుంది. అనతి కాలంలోనే మా ఇంట్లో మనిషిలా కలిసిపోయింది.

అందుకు మేమెంతో సంతోషించాం.

నాన్నగారి ఆరోగ్యం కుదుట పడింది. రాజకీయంగా, వ్యాపార పరంగా నాన్న మరింత ఎదుగుతున్న సమయం అది. ఆయన్ని ప్రజల్లో ఆయనకున్న ఫాలోయింగ్‌ని చూసి ఓర్వలేనివాళ్లు "రంగనాథ్‌కి, మానెమ్మకి ఏదో సంబంధం" అంటూ పుకార్లు రేపారు.

మా ప్రమేయం లేకుండానే అది చాప కింద నీరులా పాకిపోయింది. ఒక చిన్న అపవాదును కూడా ఎరుగని నాన్నను ఆ విషయం బాగా కుంగదీసింది. దానికితోడు తన వల్ల మా కుటుంబంలో కలతలు రాకూడదని ఎవ్వరికీ చెప్పకుండా మానెమ్మ ఎటో వెళ్లిపోయింది. మేం అవేమీ పట్టించుకోకుండా ఆమె కోసం ఎంతగానో వెతికాం.

"ఏ సంబంధమూ లేకపోతే ఆమె కోసం ఎందుకంతగా వెతుకుతారు?" అంటూ ఏవేవో మాట్లాడారు చాలామంది. ఎన్నో అన్నారు. అయినవాళ్ల చీదరింపులు, నిజానిజాలతో పని లేదన్నట్లు మీడియా ఆయన్ని చూపించిన విధానం వల్ల రాజకీయం గానూ, వ్యాపారంలోనూ నష్టం రావడంతో మానసికంగా బలహీనంగా ఉన్న నాన్నగారి గుండె కొట్టుకోవడం ఆగిపోయింది.

అన్నేళ్లు మా ఇంట్లో ఉన్న మానెమ్మ తన కోసం ఏనాడూ ఏమీ అడిగింది లేదు. కృతజ్ఞతగా ఏదైనా కోరుకోమని నాన్నగారు ఆమెను ఎన్నో సార్లు అడిగారు. "ఇల్లాలు బాగుంటేనే ఏ ఇల్లయినా బాగుంటదయ్యా. అట్లాంటిది ఆ ఇల్లాలుకి పురిటికట్టం వత్తే సూట్టానికి వైద్యులే లేని ఊళ్లు మావి.

గతుకుల రోడ్డులో ఎడ్లబండి మీద పురుడు పోసుకున్న నా లాంటి కట్టం ఇంకే ఇల్లాలికీ రాకూడదయ్యా. బిడ్డని పోగొట్టుకున్నాను. భర్తని కూడా పోగొట్టుకున్నాను. మాలాంటి కూలివాళ్ల బతుకులు మారే దారి సూడండయ్యా" అంటూ ఆవేదన చెందేది.

నాన్నగారి చివరి కోరిక, మానెమ్మ కన్న 'నిస్వార్థ కల' కోసం నేను నడుం బిగించాను. అది ఇప్పుడిలా నెరవేరింది. నాన్నగారికిలా జరగడానికి ఒక రకంగా తనలాంటి వ్యాపార, రాజకీయ నేత స్వార్థపూరిత పనులేనని అంటుండేవారు.

కానీ, నేను ఈరోజు పూర్తి చేయగలిగానంటే దానికి కారణం వీరప్రతాప్ గారు. రాజకీయ నాయకులంటే అంతా చెడ్డవారే అనుకోవడానికి లేదు. ఎటువంటి ప్రలోభాలకి లొంగకుండా ప్రజలకి మంచి చేయలనుకునే వీరప్రతాప్ గారిలాంటి మంచి నాయకులు కూడా ఉన్నారు.

నన్ను కనకపోయినా, స్వంత కొడుకులాగా పెంచిన మానెమ్మ అమ్మ గురించి తెలియని మీకందరికీ పరిచయం చేయడం కోసమే ఈరోజు ఈ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగింది" అంటూ మానెమ్మని మీడియాకి, ఊరి ప్రజలకి సగర్వంగా పరిచయం చేశాడు మనోహర్. తనెప్పుడో కోరిన కోరిక తీర్చడం కోసం ఇన్నాళ్లుగా కష్టపడిన మనోహర్‌ని చూస్తూ తన వల్ల ఊరికి జరిగిన మంచి, తన మీద పెంచుకున్న ప్రేమకి ఉబ్బితబ్బివుతూ ఆనంద బాష్పాలను ఆశ్రయించింది మానెమ్మ.

# విశిష్ట ప్రక్రియల 'పూర్ణచంద్'

తెలుగు భాషోద్యమం పేరు చెప్పగానే స్ఫురించే, సాహితీవేత్త, కవి, నవలాకారుడు జీవిత చరిత్రకారుడు, వ్యాసకర్త, చిత్రకారుడు, వైద్యుడైన డాక్టర్ జి.వి.పూర్ణచందు. శతాధిక గ్రంథ రచయితగా భాషకు, సాహిత్యానికి, ఆరోగ్య జీవన సంపద పెంపొందించే రచయితగా అధ్యయన, పరిశోధన, రచనా వ్యాసంగంతో ముందుకు సాగుతున్నారు.
1975లో 'ఆత్మలతో మాట్లాడగలమా?' తొలి రచనగా, సాహితీ ప్రస్థానం ప్రారంభించిన బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రతిభావంతునిగా గుర్తింపు పొందారు. పాఠకులకు ప్రాచీన, పాశ్చాత్య మనస్తత్వ సిద్ధాంతాల అధ్యయనం సమ్మేళనంతో యువకునిగా డాక్టర్ పూర్ణచందు 'అమలిన శృంగారం' వెలువరించడం తెలుగు సాహిత్య వైజ్ఞానిక ప్రతిభా విశేషంగా ప్రశంసనీయమైంది. క్రమేపీ సాహితీ స్వర్ణోత్సవానికి చేరువగా డాక్టర్ పూర్ణచందు తన యాభై యేళ్ల రచనా ప్రస్థానంలో ఇప్పటికి 130 గ్రంథాల రచయితగా ముందడుగులు వేస్తున్నారు. తెలుగు పలుకుల తియ్యదనం, పుట్టుక, ప్రాచీన విశిష్టత, భాష, సాహిత్యం, 2021 జనవరి ఆరంభంలో మాడభూషి సాహిత్య కళాపరిషత్ 'పూర్ణచందు', సాహిత్యం-జీవితం వ్యక్తిత్వంపై అంతర్జాల సదస్సు నిర్వహించింది. ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సంపాదకునిగా పూర్ణచంద్రోదయం సాహిత్యానుశీలన గ్రంథంలో 70 పైగా తెలుగునాట ప్రముఖ రచయితలు వివిధ కోణాలలో తమ పత్రాలను సమర్పించారు. ఆ పత్రాల సంకలనం పూర్ణ చంద్రోదయంగా తెలుగు సాహితీలోకాన్ని అలరిస్తోంది.
డా॥ పూర్ణచందు సాహితీ జీవన



కళారత్న డాక్టర్ పూర్ణచందు, 2022లో 'జాగృతి' వారపత్రికలో సీరియల్‌గా ప్రచురింపచేసిన ఆరోగ్యం-ఆనందం శీర్షిక 'తాంబూలం' డాక్టర్ పూర్ణచందు ప్రతిభను వ్యక్తం చేస్తోంది. ప్రాచీన సాహిత్యంలో నిక్షిప్తమైన వైద్య సంబంధిత రహస్యాలను వెలికితీసి ఆహారపు విలువలను, సాహిత్యాన్ని చరిత్రను సమ్మిళితం చేసే అరుదైన 24 వైద్య గ్రంథాలు, 16 ఆహార చరిత్ర-ఆరోగ్య ప్రభావం రచనలలో ఆహారోపనిషత్తు అయిదు భాగాలుగా అత్యుత్తమ రచనలు వెలుగు చూసాయి. సంపాదకులుగా 33, తెలుగు భాషోద్యమ కరదీపికలు, పరిశోధనా వ్యాస సంపుటిలు 22 వెలువరించారు. ఇటీవల 2022లో అఖిల భారత తెలుగు అకాడమీ బెంగళూరు 'నయనానంద కారక తారకరాముడు' ప్రచురించింది. డా॥ జి.వి.పూర్ణచందు తెలుగులో రాసిన 300 పేజీల ఉద్గ్రంథం 'అమలిన శృంగారం' 1980లో వెలువరించారు. ప్రేమకోసం తహతహలాడటం, లైంగిక సంబంధాలు లేకుండా కేవలం మానసిక బాంధవ్యం 'ప్లేటోనిక్ లవ్'ను మనోవిశ్లేషణా గ్రంథంగా 23వ ఏట రాయడం అరుదైన యువ సంస్కృతి, చరిత్రల అనుశీలనా గ్రంథంగా 'తెలుగుకోసం' హృదయం ఉన్న తెలుగువారి గుండె తట్టి లేపుతుంది. బిడ్డ పుట్టగానే చేసే తొలి రోదనలో అమ్మపలుకులు ఉంటాయని, మనిషి మనసు క్రమేపీ అమ్మభాషలో ఏవిధంగా రూపొందుతుందో చక్కగా విశ్లేషించగల ప్రజ్ఞతో పూర్ణచందు, పరిశోధనాత్మకంగా కొత్త కోణాలు ఆవిష్కరించారు. తెలుగు సాహిత్యంలో పౌరాణిక పాత్రలకు చారిత్రక ఆధారాలతో రచించిన ప్రప్రథమ రసవత్తర నవలా కావ్యం 'సప్తసింధు'. నడుస్తున్న ప్రస్తుత వర్తమాన మూలాలను వెలికితీసిన 'తెలుగుధీర' నవలలకు సముచిత కల్పనలతో, వాస్తవ కథనాలను గెజిటీర్ల నుంచి, ఆంగ్ల, తెలుగు గ్రంథాల నుంచి సేకరించి నవలలకు ఒక ప్రామాణికతను సమకూర్చడంలో డా॥ జి.వి.పూర్ణచందు కృతకృత్యత సాధించారు.
కరోనా ఎదుర్కోవడానికి రోగిబలం పెంచడం, రోగబలం తగ్గించడం అన్న సూత్ర ప్రాతిపదికగా, కరోనా విపత్తుకు పరిష్కార మార్గాలు 'కరోనా సంహారం'లో సూచించారు.

**సాహిత్యం**

ప్రస్థానం, అకుంఠిత దీక్షతో నిరంతర సాధన, అధ్యయనశీలిగా, మౌలిక పరిశోధనల అంశాల నిత్య కృషీవలునిగా బహుముఖీనతగా సాగుతోంది.
1957 ఏప్రిల్ 23న జన్మించిన డా॥ పూర్ణచందు 66 ఏళ్ల వయసులో కూడా నవ నిర్మాణాత్మక సత్కృషితో చైతన్యవంతమైన భాషా, సాంస్కృతిక, సేవా తత్పరతతో తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకొంటున్నారు. తెలుగుభారతికి నిత్యం అక్షర నైవేద్యం సమర్పించే రసిసిద్ధుడైన వైద్యేశ్వరునిగా, జనజీవన ఆరోగ్య పరిరక్షణతో సాహిత్యానుశీలన కొనసాగించడం అభినందనీయం.
కళాప్రపూర్ణ, సుప్రసిద్ధ నవలా, కథా రచయిత్రి డా॥ తెన్నేటి హేమలత "జయంతితే సుకృతే రససిద్ధా వైద్యేశ్వరా" అనే శ్లోకం ప్రకారం రససిద్ధి (అంటే వైద్యం) సుందరమైన కవిత్వంలాగా సోదరుడు పూర్ణచందుకు సిద్ధించిందంటే అతిశయోక్తి కాదు" అన్నారు.
పరిపూర్ణ చంద్రుడి సాహితీ జీవన ప్రస్థానం సంపాదకీయంలో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ప్రస్తావించినట్టు వైద్య, వైజ్ఞానిక, చరిత్రను సాహిత్యంతో సమ్మిళితం చేయగల బహుముఖీన ప్రజ్ఞాశీలిగా డా॥ పూర్ణచందు మున్ముందు మరెన్నో విజయసోపానాలు అధిరోహించగలరు.

**- జయసూర్య**

# ఇంటి మూలల పైకప్పులు ఎలాంటి ఫలితాలనిస్తాయి?


**వాస్తువార్త**



వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458


**ఇంటి** మూలల పైకప్పులు సరైన విధంగా, సరైన మూలలయందుంటే సిరుల కుప్పలు వస్తాయి. వక్రిస్తే ముప్పులు వస్తాయి. వాటినెలా అమర్చుకోవాలో తెలుసుకొని ఆచరణలో పెట్టడం ద్వారా ఇంటి యజమాని లాభం పొందవచ్చు. తద్వారా ఆ ఇంట్లో వుండే కిరాయిదారులు కూడా ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

## నైరుతి కప్పు

ఇంటికి నైరుతి భాగంలో ఉన్న మూలపై కట్టడం జరిపి పైన కప్పు వేస్తే దాన్ని నైరుతి కప్పు అంటారు. నైరుతి భాగంలో వీలయినంత ఎత్తుగా గోడలు లేపి పై భాగాన్ని స్లాబ్‌తోగానీ, రేకులతోగానీ కప్పివేసేటప్పుడు తూర్పు లేదా ఉత్తర భాగాలకు పల్లం వుండేట్టు జాగ్రత్త పడాలి. వర్షపు నీరు ఆ కప్పుపై పడితే జారి తూర్పు వైపుకు లేదా ఉత్తరం వైపుకు పారాలి. ఈశాన్యం వైపుకి పారితే మరీ మంచిది. ఇటువంటి నైరుతి కప్పు వున్న ఇల్లు ఐశ్వర్యంతో తులతూగుతుందనటంతో అతిశయోక్తి లేదు. నైరుతి మూల పైన కప్పు లేకుండా ఖాళీగా వుంటే అది కోరి దరిద్ర్యాన్ని ఆహ్వానించినట్లే అవుతుందని గ్రహించాలి. ఒకవేళ ఖాళీగా వుంటే అక్కడ నైరుతి భాగం ఎంతవరకు వుంటుందో లెక్కలు వేసి ఆ భాగాన్ని వెంటనే మూయించటం మంచిది. నైరుతి భాగంలో ఏ నిర్మాణం పనులు చేసినప్పటికీ అందుకు కావలసిన సిమెంటు, ఇటుకలు మొదలయిన వాటిని ముందుగా అమర్చుకొని పనిని నిలుపుదల లేకుండా పూర్తి చేయాలి.

పని పూర్తయ్యేవరకు ఇంట్లోవాళ్లెవరూ ఆ ఊరు వదిలి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నైరుతి కప్పువేసే పని ఎంత త్వరగా పూర్తి చేయగలిగితే అంత మంచిది. అయితే కొలతలు వేసి నైరుతి భాగాన్ని సరిగ్గా నిర్ణయించడంలో జాగ్రత్త తీసుకోవడం అవసరం.

## వాయువ్య కప్పు

గృహానికి వాయువ్య భాగంలో వున్న ఉత్తరపు భాగాన్ని మూసివేస్తూ కట్టే గదుల వల్ల ఉత్తర వాయువ్యం మూత ఏర్పడుతుంది. ఉత్తర వాయువ్యం మూత వలన ఆ గృహంలో అస్థిరత్వం చోటు చేసుకుంటుంది. చాలామంది వాయువ్యంలో బాత్‌రూమ్‌లు కట్టి స్థలాన్ని సద్వినియోగం చేస్తున్నామనుకుంటారు. అది సరైంది కాదు. ఉత్తరపు గోడను ఆనుకోకుండా ఉత్తర వాయువ్యం వున్నంత మేరకు స్థలాన్ని వదిలేసి పడమర గోడను ఆనుకొని కట్టుకోవచ్చు. కానీ పడమర వాయువ్యపు దారి ఎన్నో శుభాలకు, మానసిక శాంతికి సంకేతం. అందుకని అటువంటి స్థలంలో బాత్ రూమ్ కట్టుకోవటం కంటే సద్వినియోగం చేసుకోదగిన మార్గాలు అనుసరించటం మంచిది. పూర్తి వాయువ్యం ఎటువంటి కట్టడాలు, కప్పులూ లేకుండా వదిలి పెట్టడం వలన ఇంట్లో స్థిరత్వం, సుఖ శాంతులు నెలకొంటాయి. ఉత్తర వాయువ్యం మూసిపెట్టి ఉంచటం వలన కలిగే నష్టాలలో ముఖ్యమైనది.. ఆ



ఇంట్లో ఎవరో ఒకరుగానీ, ఇంటి యజమానిగానీ మానసికంగా అనారోగ్యం పాలవుతారు.

## ఆగ్నేయం కప్పు

గృహానికి ఆగ్నేయ మూలనానుకొని ఏదయినా కట్టడం వుండి పైన కప్పు వేసి వుంటే అది ఆగ్నేయ కప్పుగా గుర్తించాలి. ఆగ్నేయ కప్పు స్త్రీలకు సుఖ శాంతులు లేకుండా చేస్తుంది. తూర్పు ఆగ్నేయం కప్పు అంటే ఆగ్నేయంలో తూర్పుగోడను ఆనుకొని కప్పు వేయటం జరిగితే అటువంటి కప్పువల్ల స్త్రీలకు దాంపత్య జీవితంలో అసౌకర్యాలు ఏర్పడతాయి. వ్యాధులు మాత్రమే కాకుండా మరో స్త్రీ ప్రమేయం వలన తన సుఖాన్ని చేజార్చుకునే దురదృష్టవంతులయ్యే ప్రమాదం ఉంది.

తూర్పు ఆగ్నేయమూల బాత్‌రూమ్‌లుగానీ, లావెట్రీలుగానీ కట్టవలసి వస్తే తూర్పు, దక్షిణాన కూడా ఆగ్నేయ భాగాన్ని పూర్తిగా వదిలేసి కట్టడం మంచిది. ఎటూ వీలుకాని పక్షంలో దక్షిణ ఆగ్నేయం గోడను ఆనుకొని కట్టినా ఫర్వాలేదుగానీ, తూర్పు ఆగ్నేయ గోడను అంటకూడదు. ఆగ్నేయ మూలను తెరచి పెట్టడం వలన ఆ ఇంట్లో స్త్రీ, పురుషుల దాంపత్య జీవితం ఆదర్శప్రాయంగా ఉంటుంది. ప్రేమానురాగాలు వెల్లివిరుస్తాయి.

## ఈశాన్యం కప్పు

గృహానికి ఈశాన్య మూలనానుకొని ఏదయినా కట్టడం వుండి పైన కప్పు వేయబడి వుంటే దాన్ని ఈశాన్యం కప్పుగా గ్రహించాలి. ఈశాన్య కప్పు మూలంగా రావలసిన సిరిసంపదలు స్తంభించిపోతాయన్నది సత్యం. అంతే గాక జీవితాలు ప్రమాదం పాలయ్యేందుకు, ముప్పు వాటిల్లేందుకు ఎక్కువ అవకాశాలున్నాయి. దాంపత్య సుఖం వున్నప్పటికీ సంతానం లేకపోవటం లాంటివి వాస్తుదోషరీత్యా సంభవించే అవకాశాలు ఎక్కువ. స్థలం వదిలబుద్ధి గాక అక్కడ లెట్రిన్స్ కడితే అంతకు మించిన దుష్ఫలితం మరోటి వుండదు. ఆ ఇంట్లోకి చేరకముందే వాళ్లకు సంతానం వుంటే, ఆ సంతానం క్రమంగా నిష్ప్రయోజనం అయ్యే అవకాశాలున్నాయి. కట్టడం చేతిలో కత్తిలాంటిది. కత్తిని పళ్ల కోసుకోవటానికి వుపయోగించవచ్చు. కుత్తుకలు కోయటానికి ఉపయోగించవచ్చు. ఎలా వుపయోగించుకుంటే శుభప్రదమో అలా వుపయోగించుకోవటం మనిషి మీద ఆధారపడి ఉంటుంది. తెలియక పొరపాటున చేయి చేసుకోకూడదనే ఇంత వివరంగా చెప్పాల్సి వస్తోంది. అదే కట్టడాన్ని ఈశాన్య మూల కట్టకుండా ఖాళీగా వదిలేసి నైరుతి మూలలో కడితే సిరులకు నడిచివచ్చే బాట ఏర్పాటు చేసినట్టే అవుతుంది. ఈశాన్యం కప్పు వేయకుండా తెరచి వుంచటం సర్వమంగళప్రదం, జయప్రదం.

దక్షిణ ఆసియా ఖండంలో అతి చిన్న దేశం సింగపూర్. ఇది చిన్న ద్వీప దేశం. సింగపూర్ అనగానే వెంటనే గుర్తొచ్చేది ఆకాశాన్ని తాకే అద్భుత నిర్మాణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల ముంగిటకు తెచ్చిన అక్కడి పరిపాలన. నూతన ఆవిష్కరణలకు నెలవైన ప్రదేశం. వీటన్నిటికంటే భిన్నమైనది అక్కడి పర్యాటక రంగం. బహుశా అందుకే కాబోలు.. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా కోటి మందికి పైగా పర్యాటకులను



# ఆకారంలో చిన్న.. ఆదాయంలో మిన్న సింగపూర్

ఆకర్షించగలుగుతోంది. అంటే ఈ దేశంలో ఉన్న జనాభా కంటే ఇక్కడికి వచ్చే పర్యాటకులు అధికంగా ఉంటారు. ఈ దేశం మలేషియాకు దక్షిణాన ఉంది. దక్షిణ ఆసియాలో సింగపూర్ అతి చిన్న దేశం. 1963 సంవత్సరంలో మలేషియా ఏర్పడినప్పుడు దానిలో భాగంగా ఉండేది. ఆ తరువాత అంటే రెండు సంవత్సరాల తరువాత సైద్ధాంతిక విభేదాలతో 1965 ఆగస్టు 9న మలేషియా నుండి విడిపోయి సింగపూర్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. వ్యాపార పరంగా, ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందిన దేశం ఇది. చక్కటి పర్యాటక కేంద్రం అయిన ఈ దేశంలో మలయ్, చైనా, భారతీయులు ఎక్కువగా స్థిరపడటంతో విభిన్న సంస్కృతులకు నిలయంగా మారింది. పర్యాటంగానే కాక విలాసాలకు, వినోదాలకు పేరు పొందిన దేశం సింగపూర్.

ప్రపంచంలో అత్యున్నత పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్న సింగపూర్‌లో చూడాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. వాటిలో నైట్ సఫారీ, బొటానికల్ గార్డెన్స్, జురాంగ్ బర్డ్ పార్కు, మెల్లయోన్ పార్కు, సెంతోసా ద్వీపం, అతిపెద్ద జెయింట్ వీల్, మరీనా బే శాండ్స్, చైనా టౌన్, అండర్ సీ వరల్డ్ చాలా ముఖ్యమైనవి. సింగపూర్ చాలా పరిశుభ్రంగా ఉంటుంది. ఇక్కడ రోడ్లపై చెత్త వేస్తే వెయ్యి డాలర్ల జరిమానా, రెండు నెలల జైలుశిక్ష విధిస్తారు. ఇక్కడ భవనాల ఎత్తు 280 మీటర్ల కంటే ఎత్తు ఉండకూడదనే నియమం ఉంది. గోకో టవర్ అనే భవనాన్ని ప్రత్యేక అనుమతితో 290 మీటర్ల ఎత్తులో నిర్మించారు. ఈ భవంతి నిర్మాణం 2013లో ప్రారంభించి 2016లో పూర్తి చేశారు. సింగపూర్‌లో ఎత్తయిన భవంతి ఇదే. ఇక్కడ ఆంగ్లం, చైనీస్, మలయ్, తమిళం భాషలకు అధికార భాషలుగా గుర్తింపు లభించింది. అవినీతి తక్కువగా ఉంటుంది దేశంలో. నేరాలు-ఘోరాలు కూడా చాలా తక్కువగా జరుగుతాయి. బిచ్చగాళ్లు అంతగా కనపడరు. సింగపూర్‌వాసులు

షేక్ అబ్దుల్ హకీం జాని

పెరుగుతో చేసిన వంటకాలను మక్కువగా తింటారు. సింగపూర్‌లోని ప్రముఖ స్థలాల్లో ఒకటి చైనా టౌన్. ఇక్కడి కాంప్లెక్స్ ఫుడ్ సెంటర్‌లో 300 దుకాణాలున్నాయి. ప్రపంచంలోని అనేక దేశాల ప్రముఖ వంటకాలన్నీ ఇక్కడ లభిస్తాయి. సింగపూర్‌లో 3 వేల కి.మీ. పొడవైన అతి పెద్ద హైవే నిర్మించారు. ఈ మార్గం ద్వారా నేరుగా హాంగ్‌కాంగ్‌కు వెళ్లవచ్చు. ఈ దేశంలో డ్రగ్స్‌తో పట్టుబడితే జైలుశిక్షలు ఉండవు. అటువంటి వారిని ఉరి తీసి నేరుగా పైకి పంపిస్తారు. సింగపూర్‌లోని మార్కీవ్ నైట్ క్లబ్ ప్రపంచంలోని అతి పెద్ద క్లబ్బుల్లో ఒకటిగా విరాజిల్లుతుంది. ఇక్కడ జులై నెలలో జరిగే ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రపంచంలోని ఆహార పదార్థాలన్నీ లభిస్తాయి.



## జురాంగ్ పక్షి కేంద్రం

ఆగ్నేయాసియాలోనే అతి పెద్ద పార్కుగా ప్రఖ్యాతి చెందిన జురాంగ్ పక్షుల కేంద్రం అద్భుతమైన ప్రదేశం. ఇక్కడ పక్షుల చేత రకరకాల విన్యాసాలు చేయిస్తారు. అద్భుతమైన ఈ ప్రదర్శన పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది.



ఇది ఆసియాలోనే అతి పెద్ద పక్షుల పార్క్. దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నిర్మించి 1971 జనవరి నుండి పర్యాటకుల కోసం తెరిచారు. ప్రారంభంలో ఇందులో కేవలం అరవై జాతులకు చెందిన వెయ్యి పక్షులు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం దాదాపు ఆరు వందల జాతులకు చెందిన ఎనిమిది వేల పక్షులు ఈ పార్కులో ఉన్నాయి. మనం పక్షులకు ఆహారం వేస్తూ ఫోటోలు తీయించుకోవచ్చు. మన అరచేతిలో ఆహారం పెట్టుకుంటే పక్షులు వచ్చి తింటాయి. ఈ పార్కులో మానవ నిర్మిత అతి పెద్ద జలపాతం ఉంది. ఇదో ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు.



## బొటానికల్ గార్డెన్స్

140 సంవత్సరాల చరిత్ర కలిగిన 'బొటానికల్ గార్డెన్స్' సింగపూర్‌లో చూడదగ్గ మరో ప్రదేశం. పది వేల రకాల వృక్షాలు ఒకే ప్రాంగణంలో ఉండటం చూసి పర్యాటకులు ఆశ్చర్యచకితులవుతారు. ఇక్కడి పువ్వులు రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంటే ఇందులోని ఆర్కిడ్ ఉద్యానవనం మరో అదనపు ఆకర్షణంగా చెప్పవచ్చు. ఆసక్తి గలవారు వాటి వివరాలు తెలుసుకునేందుకు అక్కడ కంప్యూటర్ తెరలను సైతం ఏర్పాటు చేశారు. ఇక్కడ పిల్లల కోసం ఓ ప్రత్యేకమైన గార్డెన్ కూడా ఉంది. ఇక్కడ ఉష్ణ ప్రదేశాల్లో ఉండే మాంసాహార చెట్లు సైతం మనకు దర్శనమిస్తుంటాయి.

చాంగి విమానాశ్రయం ప్రయాణికుల స్వర్గధామంగా భావించే అద్భుత పర్యాటక ప్రదేశం. అరుదైన వృక్షజాతుల్నీ, జీవజాతుల్నీ చూడాలనుకునే వాళ్లకి చాంగి ఎయిర్‌పోర్ట్ ఓ చూడచక్కని వేదిక. సుమారు 250 జాతులకు చెందిన ఐదు లక్షల మొక్కలు అక్కడ కనువిందు చేస్తుంటాయి. ముళ్లమొక్కల కాక్టస్ గార్డెన్, తామరపూల కొలను, ఆర్కిడ్ వనం, జలపాతాలతో కూడిన వర్షారణ్యం, పొద్దుతిరుగుడు పూలతోట.. ఇలా పలు రకాల ఉద్యానవనాల్లో హాయిగా విహరించవచ్చు. సీతాకోకచిలుకలకు అక్కడో ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. అందులో సింగపూర్ జాతీయ కీటకమైన గులాబీ వర్ణ సీతాకోకచిలుకలతో పాటు నలభై జాతులకు చెందిన ఇతర సీతాకోకచిలుకలు ఎగురుతుంటాయి. ప్రకృతి అందాలకి సాంకేతిక పరిజ్ఞానం తోడయితే ఎంత అద్భుతంగా ఉంటుందో అన్నదానికి అక్కడి ఎన్చాంటెడ్ గార్డెన్ ప్రత్యక్ష నిదర్శనం. అందులో ప్రధానంగా ఆకర్షించేది అక్కడున్న నిలువెత్తు పూలకుండీని చూడగానే అది మొక్కల్ని పెంచే కుండీలా అనిపిస్తుందిగానీ అదో ఫ్లవర్ వేజ్. బొకే ఆకారంలో గాజుతో చేసిన ఆ వేజ్‌లో దాదాపు రెండు వేలకు పైగా టెస్ట్ ట్యూబులు అమరి ఉంటాయి. ఒక్కో ట్యూబులో తాజా పూలని, ఆకుల్నీ ఉంచి వాటిని ఎప్పటికప్పుడు మారుస్తూ నిజంగానే అందులో మొక్కల్ని పెంచుతున్నారేమో అనిపించేలా చేస్తుంటారు. అలాగే అక్కడున్న కొలనులో నారింజ రంగులోని ఆర్చర్, కొయ్ చేపలూ నీళ్లలో కేరింతలో కొడుతూ సందర్శకుల్ని ఆహ్వానిస్తుంటాయి. వందలాది సీతాకోకచిలుకలే కాకుండా మూడు వేల రకాల అరుదైన అందమైన కీటకాల్ని చూడవచ్చు.

## నైట్ సఫారీ

సాధారణంగా జంతు ప్రదర్శనశాలలను చూడాలంటే ప్రపంచంలో ఎక్కడైనా పగటి వేళల్లోనే అనుమతిస్తుంటారు. కానీ సింగపూర్‌లో దీనికి భిన్నంగా రాత్రివేళల్లో కూడా వాటిని సందర్శించవచ్చు. దీనినే 'నైట్ సఫారీ' అని పిలుస్తుంటారు. జంతువులు పగటి వేళల్లో కంటే రాత్రి వేళల్లోనే సహజసిద్ధంగా సంచరిస్తుంటాయనేది ఇక్కడివారి వాదన. రాత్రివేళల్లో తిరిగే జంతువులను, పక్షులను చూడాలంటే ప్రత్యేకమైన చీకటి గుహల్లోనే చూడాలి. ఈ అవకాశాన్ని ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా కల్పించిన దేశం సింగపూర్. రాత్రుల్లో జంతువులను వాటి సహజ పరిస్థితుల్లో చూసే అవకాశం కలగటంతో పర్యాటకులు ఓ వింత అనుభూతికి లోనవుతారు. ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికాకు చెందిన అనేక అరుదైన అడవి జంతువులను అక్కడ చూడవచ్చు. నైట్ సఫారీని చూసేందుకు పర్యాటకులు ట్రాములో వెళ్లాల్సి ఉంటుంది. ట్రాము నెమ్మదిగా కదులుతుంటే, జంతువులు వాటి సహజ పరిసరాలలో మనకు చాలా దగ్గర నుంచీ కనిపిస్తాయి. ఇలా రాత్రిళ్లు మన కళ్లముందే అవి తిరుగాడుతుంటే చూడటం ఓ వింత అనుభూతి కలుగుతుంది. నైట్ సఫారీకి వెళ్లిన వెంటనే అక్కడి ఆదివాసీల నృత్యం స్వాగతం పలుకుతుంది. ఈ నైట్ సఫారీలో ప్రత్యేక ఆకర్షణ అక్కడి ఆదివాసుల స్వాగత నృత్యం. బలంగా ఉండే యువకుల విలువిద్యా కౌశల ప్రదర్శన, వెదురు



బొంగులు వేగంగా కదులుతుంటే వాటి మధ్య అడుగులు వేస్తూ చేసే నృత్యం చూడముచ్చటగా ఉంటాయి. ఇందులో మరో ఆకర్షణ మంటలతో చేసే నృత్యం.

**సెంతోసా ద్వీపం**

సింగపూరు పర్యటనలో సెంతోసా ద్వీపాన్ని సందర్శించకపోతే ఆ పర్యటన అసంపూర్ణమని చెప్పాలి. సింగపూర్‌కు దక్షిణాన ఉన్న పర్యాటక ద్వీపం. ఇందులో భాగమైన సెంతోసా ద్వీపంలో సింగపూరు సాంస్కృతిక జాతీయ చిహ్నమైన మెర్లాయన్ కింది సగభాగం చేప, పై సగ భాగం సింహం చూడముచ్చటగా ఉంటుంది. 37 మీటర్ల ఎత్తున్న ఈ విగ్రహాన్ని రెప్పవేయకుండా చూడాలని పిస్తుంది. సందర్శకులను మెర్లాయన్ తలభాగం వరకు లిఫ్ట్‌లో తీసుకువెళతారు. సెంతోసాకు ప్రతి సంవత్సరం ఐదు మిలయన్లకు పైగా సందర్శకులు వస్తుంటారట. ఇందులో చూడదగిన అనేక ప్రముఖ ప్రదేశాలు ఉన్నాయి. ఈ దీవపంలోకి కేబుల్‌కార్‌లో వెళ్తే చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. భూమి నుంచి అనేక అడుగుల ఎత్తు నుంచి విహంగ వీక్షణం చేయగలగడం ఒక మరపురాని అనుభూతి. వీటిలో రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జపనీయుల నుండి రక్షణగా దుర్గంగా సిలోసో కోట నిర్మించారు. ఈ ద్వీపంలోనే 'టైగర్ స్కై' టవర్ నిర్మించాడు. దీన్ని ఎక్కి చూస్తే సెంతోసా ద్వీపం అద్భుతంగా కనిపిస్తుంది. ముందుగా ఒక చిన్న ప్రదర్శన ఉంటుంది. ఇక్కడ సంప్రదాయక భవనంలో సింగపూర్ చరిత్రను లేజర్ షో సహాయంతో ప్రదర్శిస్తారు. అతి సహజమైన పరిస్థితిలో జీవం ఉట్టిపడే బొమ్మలతో నావ ప్రయాణం, నావికులు, వర్తకం.. ఇలా అనేక సంప్రదాయాలు ప్రతిబింబించే బొమ్మలతో కూడిన ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ చూడవలసిన వాటిలో అండర్ వాటర్ వరల్డ్ ఇంకొకటి. భూగర్భంలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ వరల్డ్‌లో అనేక సముద్ర ప్రాణులు సజీవంగా చూసే ఏర్పాటు ఉంది. ఇక్కడి 'అండర్ వాటర్ వరల్డ్'లో 2500 జాతులకు చెందిన 2,500 జలచరాల్ని చూసే వీలుంది. 83 మీటర్ల సొరంగం నుంచి ట్రాన్స్లేటర్ ద్వారా అనేక రంగుల, ఆకారాల జలచరాల్ని చూడడం ఒక వింత అనుభవం. రాత్రివేళలో అద్భుతమైన లేజర్ షోలు జరుగుతూ ఉంటాయి. సింగపూరు సముద్ర తీరాన రేవు(హార్బర్) నుండి క్రూయిజ్‌లలో 12 గంటల టూర్, రెండు నుండి మూడు రోజుల పడవ ప్రయాణం చేయవచ్చు. ఈ టూరులో ఈ దేశంలో భాగమైన ఇతర దీవులను సందర్శించవచ్చు.



సముద్ర తీరంలో డాల్ఫిన్ షోలను జరుపుతుంటారు. లిటిల్ ఇండియా, చైనా టౌన్, సెరంగూన్ రోడ్.. చూడాల్సిన వాటిలో ప్రధానమైనవి. పండుగ సమయాలలో అంగడివీధులను చూడముచ్చటగా అలంకరిస్తారు. విదేశీయులు ఇక్కడ ముస్తాఫా, సన్ టెక్‌లలో తమకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తుంటారు.

సన్ టెక్ నిర్మాణాన్ని ఇక్కడి ప్రజలు గొప్పగా వర్ణిస్తుంటారు. ఇక్కడ అనేక మతాలకు సంబంధించిన దేవాలయాలు ఆయా సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ భక్తులను అలరిస్తుంటాయి.

ఇక్కడి భోజనశాలల్లో రుచికరమైన భారతీయ భోజనం లభిస్తుంది. ●




## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే!

మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి.

ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com



## వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

### మేషం

రుణాలు తీర్చడంలో ఇబ్బందులుంటాయి. కోర్టు వ్యవహారాలు సానుకూలం. వ్యాపారులకు యథాతథంగా ఉంటుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి లాభదాయకం. కుటుంబంలో మనస్పర్థలకు అవకాశం. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. పనుల్లో ఆటంకాలు ఎదురవుతాయి. ఉద్యోగులకు పదోన్నతి. శత్రువుల వల్ల సమస్యలు ఎదురవుతాయి.

### వృషభం

ఆరోగ్య సమస్యలుంటాయి. వృత్తి ఉద్యోగాల్లో వున్నవారికి బాగుంటుంది. ఆటంకాలు ఎదురైనా పనులు సకాలంలో పూర్తి చేస్తారు. అకారణంగా మానసిక చింతనకు లోనవుతారు. రుణాలు తీర్చడంలో ఇబ్బందులుంటాయి. ఉద్యోగాభివృద్ధి బాగుంటుంది. నిరుద్యోగులకు ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది. ప్రముఖులను సందర్శిస్తారు.

### మిథునం

దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. వ్యాపారులు రుణాలు చేయాల్సి వస్తుంది. ధర్మ రక్షణకై పాటుపడతారు. జీవిత భాగస్వామితో మనస్పర్థలకు అవకాశం. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. విలువైన వస్తువులు చేజారిపోయే సూచనలున్నాయి కనుక జాగ్రత్తగా ఉండండి. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి.

### కర్కాటం

మానసిక ఆందోళన చెందుతారు. వృథా కాలక్షేపం చేస్తారు. అనుకోని వార్తలు వింటారు. ముఖ్యమైన పనులు వారాంతంలో పూర్తి చేస్తారు. సామాన్య ధన లాభం. ఖర్చులు కూడా అదే స్థాయిలో ఉంటాయి. అనుకున్న పనులు సకాలంలో పూర్తి కావు. వృద్ధుల యోగ క్షేమాల గురించి శ్రద్ధ వహిస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారికి లాభదాయకం.

### సింహం

వృథా కాలక్షేపం చేస్తారు. ఆర్థికంగా బాగుంటుంది. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. వృత్తి వ్యాపారాల్లో ఉన్నవారికి లాభాలు బాగుంటాయి. విద్యార్థులకు శుభ యోగం. వారాంతంలో వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. విహార యాత్రలు చేస్తారు.

### కన్య

విద్యార్థులకు శుభ యోగం. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. వృత్తి వ్యాపారాల్లో వున్నవారికి ఆర్థికంగా బాగుంటుంది. వృథా ఖర్చులుంటాయి. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. అనుకోని వార్తలు వింటారు.

### తుల

ఉద్యోగులకు పదోన్నతి సూచనలున్నాయి. దూర ప్రాంత ప్రయాణం చేస్తారు. దంపతుల మధ్య అన్యోన్యత ఏర్పడుతుంది. సామాన్య ధన లాభాలుంటాయి. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. శత్రువుల బాధ తొలగిపోతుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. స్వల్ప అనారోగ్య సమస్యలుంటాయి. ఆటంకాలు ఎదురైనా సకాలంలో పనులు పూర్తవుతాయి. ఉద్యోగులకు పదోన్నతి సూచనలున్నాయి. కుటుంబ సౌఖ్యం.

### వృశ్చికం

బంధు, మిత్రులను కలుసుకుంటారు. మనోధైర్యం పెరుగుతుంది. కుటుంబంలో స్వల్ప కలతలు వచ్చే అవకాశాలున్నాయి. స్త్రీలకు శుభ యోగం. వాహన కొనుగోలు చేసే సూచన్నాయి. వ్యాపారులు అధిక రుణాలు చేయాల్సి వస్తుంది. ముఖ్యమైన విషయాల్లో ఎటూ నిర్ణయించుకోలేని సందిగ్ధ పరిస్థితి ఏర్పడుతుంది. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహిస్తారు. సమస్యలు పరిష్కారం.

### ధనుస్సు

వృత్తి రంగాల్లో వున్నవారికి ఆర్థికంగా బాగుంటుంది. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. శుభ కార్యాలకు అనుకూలమైన సమయం. శత్రుబాధలు తొలగిపోతాయి. వృత్తి ఉద్యోగాల్లో వున్నవారికి ఉత్సాహంగా గడుస్తుంది. ఇతరులకు సామాన్య ధన లాభాలుంటాయి. వ్యాపారుల మధ్య పోటీ ఉంటుంది. ఉద్యోగులకు పై అధికారుల వత్తిడి ఉంటుంది, సంయమనంతో మెలగడం మంచిది.

### మకరం

వాహన యోగం. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. దేశాంతర ప్రయాణం చేస్తారు. ఆర్థికంగా బాగుంటుంది. కోర్టు వ్యవహారాలు సానుకూలంగా ఉంటాయి. అనుకున్న పనులు వారాంతంలో పూర్తి అవుతాయి. వృత్తి రంగాల్లో ఉన్నవారికి పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. చిరకాలం కోరిక తీర్చుకుంటారు. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. ఆరోగ్య సలహాలు పాటించండి.

### కుంభం

చోర భయం పొంచి వుంది కనుక విలువైన పత్రాలు, వస్తువుల విషయంలో జాగ్రత్తలు పాటించండి. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం సముచితం కాదు. ఆర్థికంగా ఆగుంటుంది. వ్యాపారులకు ఆశాజనకంగా ఉంటుంది. రుణాలు తీరుస్తారు. గృహ లాభం. ఉద్యోగులకు స్థాన చలన సూచనలున్నాయి. స్త్రీల వల్ల సమస్యలు వచ్చే సూచనలున్నాయి.

### మీనం

సమస్యలు తీరి ప్రశాంతత ఏర్పడుతుంది. వృత్తి వ్యాపారాల్లో వున్నవారికి ఆర్థికంగా బాగుంటుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. వ్యాపారులకు ఆశించిన ఫలితాలు ఉండకపోవచ్చు. జాయింటు వ్యవహారాలు వారాంతంలో పరిష్కారమవుతాయి. పాప కార్య చింతన మంచిది కాదని తెలుసుకుంటారు. ప్రముఖులను సందర్శిస్తారు. కుటుంబ సభ్యుల మధ్య స్వల్ప అభిప్రాయ భేదాలు వచ్చే అవకాశాలున్నాయి.





# పాత వస్తువులు సరికొత్తగా..

పూర్వ కాలంలో రాజభవనాల్లో మాత్రమే తినే పాత్రల దగ్గర నుంచి సేద తీరే కుర్చీ, పడుకునే మంచం వరకూ అన్నీ బంగారంతో ఉండేవి. తర్వాత్తర్వాత ఆ లోహం సామాన్యులకూ చాలా దగ్గరైంది, అన్ని రకాల ఆభరణాల్లోకీ చేరిపోయింది. ధగధగలాడే దాని వన్నెలకున్న క్రేజ్‌తో బంగారం హోదాకు చిహ్నంగా మారిపోయి, అలంకరణ వస్తువుల్లోనూ వచ్చేసింది. పూజగదిలో దేవుని పటం ముందు ఉంచే పూలతో మొదలైన ఆ బంగారు మెరుపులు నెమ్మదిగా పూజ సామాన్లు, విగ్రహాలు, మండపాల వరకూ అన్నింటినీ తాకేశాయి. మరికొందరైతే ఇంకో అడుగు ముందుకేసి, బంగారు పళ్లాలు, గిన్నెల్నీ చేయించుకుంటున్నారు. అలా పసిడి కాంతులు వెదజల్లే వస్తువులు ఇంట్లో ఉంటే బాగుంటుందని చాలామంది కోరుకున్నా అది అందరికీ సాధ్యం కాదుగా! దానికి బోలెడంత డబ్బు ఖర్చు అవుతుంది.



అచ్చంగా బంగారు నగల్లా కనిపించే బంగారు పూతతో ఉండే జ్యువెలరీ వచ్చినట్టే గోల్డ్ ప్లేటెడ్ వస్తువులూ వచ్చాయి. కొత్తగా ఇప్పుడు మన ఇంట్లోని వస్తువుల్ని మనకు కావాల్సినట్టుగా బంగారు, వెండీ, ఇత్తడీ, రాగి.. ఇలా రకరకాల లోహాలతో పూత పూయించుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది.

యాంటిక్ గోల్డ్ ఫినిషింగ్, గోల్డ్ ప్లేటింగ్, గోల్డ్ కోటింగ్ అంటూ రకరకాల పేర్లతో మంత్ర గోల్డ్ కోటింగ్స్ లాంటి సంస్థలూ, కొన్ని జ్యువెలరీ దుకాణాలు వస్తువుల పైన వెండీ, బంగారాలతో పాటు ఇతర లోహాల పూతలూ వేసిస్తున్నారు.

## ఎలా చేస్తారు?

ఏ లోహంతో చేసిన వస్తువు అయినా సరే, దాన్ని అచ్చంగా బంగారంతోనో, వెండితోనో చేశారా అన్నట్టుగా తీర్చిదిద్దడానికి నానో టెక్ గోల్డ్ డిపాజిషన్, ఎలక్ట్రోప్లేటింగ్ లాంటి టెక్నాలజీని వాడతారు. దీంతో ఆ వస్తువులు ధగధగా మెరిసిపోతూ కనిపించడమే కాదు, ఆ పూతలు పోకుండా ఉంటాయి. లోపలున్న లోహం తుప్పు పట్టకుండా ఉంటుంది. 24 క్యారెట్ల అసలైన లోహంతో మనం అభిరుచి మేరకు రకరకాల పొరల్లో కోటింగ్ వేసి ఇస్తారు. వస్తువు పరిమాణాన్ని బట్టి చదరపు అంగుళానికింత చొప్పున డబ్బులు తీసుకుంటారు. అద్భుతంగా చెక్కిన అలనాటి దేవుళ్ల విగ్రహాలు, వారసత్వంగా వస్తున్న దీపపు కుందెలు, హారతి పళ్లెం, బిందెల్లాంటి రకరకాల ఇత్తడి సామాన్లు, భద్రంగా దాచుకున్న పతకాలు, బహుమతి కప్పులు, నాణేల్లాంటివి పాతబడ్డాయనో, మరకలతో వాటి అసలు రంగును పోగొట్టుకున్నాయని ఇక అటకమీద పడేయక్కర్లేదు. ఎంతో కొంతకు అమ్మేసి ఒకనాటి జ్ఞాపకాల్ని వదిలేసుకోనవసరం లేదు. ఎంచక్కా బంగారు, వెండీ లాంటి లోహాల పూతలతో మళ్లీ వాటికి కొత్త రూపం ఇచ్చేసి, ఇంట్లో అందంగా పెట్టేసుకోవచ్చు. పాతబడి రంగు వెలిసిపోయాయి అనుకున్న వస్తువులన్నీ ఇక మిలమిల మెరుపులు, యాంటిక్ లుక్‌తో మెరుస్తాయి. ❑







# ఈ ఉగాదికే పెళ్లి

కనుమ ఎల్లారెడ్డి

"ఒరే నరసింహం! ఇంకా ఎన్నాళ్లిలా కష్టపడతావురా? ఈ ఉగాదికైనా పెళ్లి చేసుకో" అన్నాడు నరసింహం తాత గరుడయ్య.

గరుడయ్యకు డెబ్బై ఏళ్లు, రెండెకరాల పొలం ఉంది. వచ్చే పింఛన్‌తో ఏదో కాలం వెళ్లబుచ్చుతున్నారు తాత, మనవడు. పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులు చిన్నప్పుడే మరణించారు. పెంచి పెద్ద చేసిన ముసలమ్మ ఈ మధ్యనే కన్ను మూసింది. ఓ చిన్న పెంకుటిల్లులో మనవడితో ఉంటున్నాడు గరుడయ్య.

నరసింహం మంచినీళ్ల కడవ దించుతూ "ఇప్పటికే నాకు నలభై ఏళ్లు వచ్చాయి, ఎవరు చేసుకుంటారయ్య" అన్నాడు.



ఆ మాటకు గరుడయ్య "అలా అనకురా, పొరుగున్న వున్న పల్లెలో భిక్షయ్య కూతురు.." అంటుండగా–

"ఆ మూగదాన్ని ఎవరు చేసుకుంటారు?" అన్నాడు.

"అలా అనకు, భిక్షయ్య కూతురు రమ మంచి రూపం, గుణం ఉన్న పిల్ల. మాట ఒకటే లేదుగానీ ఐదు ఎకరాల ఆస్తి వస్తుంది. ఆ అమ్మాయికి తల్లిదండ్రులు లేరు. వాళ్ల తాత చనిపోయారు. అవ్వ పోషిస్తోంది. వాళ్లకు మగదిక్కు లేదు. నా మాట విని రమను పెళ్లి చేసుకో" అన్నాడు.

"పోయి పోయి మూగదాన్ని ఎలా చేసుకోమంటావ్ అయ్యా" అన్నాడు.

"మనం మానవత్వంతో ఆలోచించాలిరా. వాళ్లకు మగతోడు ఎవరూ లేరు. ఆ ముసలమ్మ రేపో, మాపో అన్నట్టు ఉంది. పాపం.. ఆ పిల్ల ఒంటరిదైపోతుంది. నా మాట విను. మాట రాకపోయినా మంచి బుద్ధి ఉంది. ఇంటిపని బాగా చూసుకుంటుంది, కాదనకు" అన్నాడు.

"చూద్దాంలే అయ్యా" అని టవల్ విదిల్చి బయటకు వెళ్లాడు.

"చూద్దాం కాదు, నేను రేపు వాళ్ల ఊరు వెళ్తున్నా" అన్నాడు కేక వేసి.

మరుసటి రోజు గరుడయ్య చేతికర్ర తీసుకుని భిక్షమయ్య ఉండే ఊరికి పయనమైనాడు. చేలల్లో నడిచి వెళుతుంటే ఆలోచనలు ముసురుకుంటున్నాయి. "నరసింహం పెళ్లి చేసి వాడ్ని ఓ ఇంటివాడిని చేస్తే నా బాధ్యత తీరిపోతుంది. వాళ్లకు ఐదు ఎకరాల పొలం ఉంది. కానీ ఏమీ పండదు. గుత్త ఎంత ఇస్తే అంత తీసుకుంటారు. ఆ ముసలావిడకు వచ్చే పింఛనే ఆధారం. రమ ఒప్పుకుంటే వాళ్ల ఇల్లు, పొలం అమ్మి ముసలిదాన్ని కూడా మన దగ్గరే పెట్టుకోవచ్చు.." అని ఆలోచించాడు.

భిక్షయ్య ఇల్లు చేరగానే బయట కసువు కొడుతోంది రమ. చూడచక్కగా ఉంది. కోటేరు ముక్కు, గుండ్రటి ముఖం, చామనచాయ అయినా బాగుంది. పిరుదులు దాటిన జడ, అమ్మాయి చూడచక్కగా ఉంది. దురదృష్టం.. 'మాట' ఒక్కటే లేదు అనుకున్నాడు.

గరుడయ్య, ముసలామెతో "నీ మనవరాలి పెళ్లి విషయం మాట్లాడటానికి వచ్చా" అనగానే–

ముసలమ్మ "మూగదాన్ని ఎవరు చేసుకుంటారు? నా ఆరోగ్యం అంతంత మాత్రమే. దాని బతుకు ఏమవుతుందో ఏమో!" అని కన్నీళ్లు పెట్టుకుంది.

గరుడయ్య ఆమెను ఓదారుస్తూ "నా మనవడికి ఇద్దాం, నువ్వు ఒప్పుకుంటావా?" అన్నాడు. ఈలోగా కాఫీ తీసుకువచ్చింది రమ.

"నీ మనవడు ఒప్పుకుంటాడా? ముందు ఆ విషయం చెప్పు" అంది ముసలావిడ.

"వాడిని ఒప్పించే బాధ్యత నాది, రమ సరే, నువ్వు నా ఊరు రావాలి, ఇక్కడ ఇల్లు, భూమి, అమ్మి మా దగ్గర ఉంటావు కదూ!" అన్నాడు.

దానికి ముసలావిడ సంతోషించి "అలాగే వస్తాను, ముందు దాన్ని ఓ అయ్య చేతిలో పెడితే సరి" అంది.

"నీకు ఆ భయం అక్కర్లేదు. మీ మనవరాలికి, నా మనవడికి పెళ్లి ఈ ఉగాదికే" అన్నాడు.

"మంచిది గరుడయ్యా శుభం.." అంది ముసలావిడ.

... ... ...

"ఒరే.. నరసింహం, ఈ ఉగాదికే నీ పెళ్లి ఖాయంరా, అమ్మాయిని చూశాను. చక్కగా ఉంది. మాట మాత్రమే రాదు. ఇంటి పనంతా చేసుకుంటుంది. నీకు బాగుంటుందిరా. వాళ్లకు ఉన్న భూమి, ఇల్లు అమ్మి ముసలమ్మను ఇక్కడికే రమ్మన్నాను. ఆమె ఒప్పుకుంది. వారి పొలం, ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బు బ్యాంకులో వేసి, నీ పొలంలో కూరగాయలు పండించవచ్చు. మా ఇద్దరికీ వచ్చే పింఛన్‌తో ఇల్లు గడిచిపోతుంది. మేం మీకు పెద్ద దిక్కుగా ఉంటాం" అని చెబుతుంటే ఒక కబురు వచ్చింది గురుడయ్యకి.

"సోమాపురంలో ఉన్న ఆ మూగ రమ అవ్వ చనిపోయింది" అని ఎవరో చెప్పారు.

ఆ మాటకు గరుడయ్య, నరసింహం ఇద్దరూ బాధపడ్డారు. వెంటనే గరుడయ్య సోమాపురం వెళ్లి అన్ని ఏర్పాటు చేశారు. కన్నీరు పెట్టుకున్న రమను ఓదార్చి "దిగులు పడకు" అని సైగలు చేశాడు. దహన ఏర్పాట్లు చేసి, కొద్ది రోజులు ఉండి రమను వెంటపెట్టుకుని వచ్చాడు గరుడయ్య.

నరసింహంను చూడగానే తమ తల దించుకుంది.

గరుడయ్య మాట్లాడుతూ "ఇక ఉగాది వారం రోజులే ఉంది. మన ఊరి రాముడి గుళ్లో మీ పెళ్లి ఈ ఉగాదికే" అనగానే నరసింహం రమ దగ్గరకు వెళ్లాడు.

"ఈ ఉగాదికే మన పెళ్లి" అని సైగ చేయగానే సిగ్గుతో ముడుచుకుంది. ❑

# ఈ వారం కా'ర్టూన్స్'


ఎవర్నీ తిట్టడం లేదులే.. 'మీనాక్షి' వాడి భార్యపేరు... 'మనీషా' వాడి కూతురు పేరు...!!
మీనాక్షి మనీషా
TS02E123
Zakir..
Zakir...
మీ ఇద్దరికీ మధ్యవర్తిగా ఉండనా? మాట్లాడుకోవడానికి...!?



హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి జిల్లాలో వున్న ప్రశార్ సరస్సుకు సంబంధించిన చిత్రాలివి. ఈ సరస్సు ఒడ్డున ఓ ఆలయం ఉంది. హిమాచల్‌ప్రదేశ్‌లోని పర్యాటక స్థలాల్లో ఈ సరస్సు ఒకటి.







